RNI No. APTEL/2009/28868

ప్రజల కోసం... ప్రజల పక్షాన...
నిజం మా నడవడి...

సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

PEOPLE ISSUES OUR MISSION

TRUTH BRINGS A BETTER SOCIETY

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 362 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 6-11- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ॥

VOLUME: 18 | ISSUE : 362 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 6-11-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

చంద్రబాబుపై కేసులు.. సీబీఐ విచారణ పిల్‌పై

హైకోర్టులో వాడివేడి వాదనలు

సీఎం చంద్రబాబుపై సీఐడీ కేసుల బదిలీ పిల్‌పై విచారణ

కేసుల్లో ఆధారాలు లేవని, ఇప్పటికే మూసివేశామని ప్రభుత్వ వాదన

వాదనల అనంతరం విచారణను నవంబర్ 10కి వాయిదా వేసిన హైకోర్టు

అమరావతి, సిటిజన్ టైమ్స్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై గతంలో సీఐడీ నమోదు చేసిన కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి బదిలీ చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టులో విచారణ జరిగింది. నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా విచారణ జరిపించాలన్న ఈ పిల్‌పై గురువారం ఇరుపక్షాల వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ నేతృత్వంలోని ధర్మాసనం, తదుపరి విచారణను నవంబర్ 10వ తేదీకి వాయిదా వేసింది. 2024లో రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కొట్టి బాలగంగాధర తిలక్ ఈ పిల్ దాఖలు చేశారు. రాష్ట్రంలో అధికార మార్పిడి కారణంగా చంద్రబాబుపై నమోదైన కేసుల దర్యాప్తు నీరుగారిపోయే ప్రమాదం ఉందని, వాటిని పూర్తిగా మూసివేసే అవకాశం ఉందని పిటిషనర్ తన పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పిల్ విచారణలో ఉండగానే పలు కేసులను "వాస్తవ దోషాలు"గా పరిగణించి సీఐడీ మూసివేయడాన్ని పిటిషనర్

తరువాయి 2లో..



ఆ సమాధానాలు తట్టుకోలేక పారిపోతారు

రాహుల్‌పై అమిత్‌షా ధ్వజం



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

ప్రధాని మోదీ బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తోన్న డిమాండ్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తప్పుపట్టారు. రాజకీయ చర్చను వీధుల్లో కాకుండా పార్లమెంట్‌లో పెట్టాలని మంత్రి సవాల్ విసిరారు. ప్రభుత్వం నుంచి వచ్చే సమాధానాలను రాహుల్ తట్టుకోలేరని ఎద్దేవా చేశారు. "బాధ్యతాయుతమైన చర్చ జరగాలని మీరు అనుకుంటే.. మీ ఆందోళనల్లో సత్యం, తర్కం ఉంటే.. రండి పార్లమెంట్‌లో చర్చించుకుందాం. ఎదురెదురుగా కూర్చొని మాట్లాడుకుందాం. కానీ, మా సమాధానాలను మీరు తట్టుకోలేరు. ఎప్పటిలాగే పారిపోతారు. పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయం కలిగించడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుంది. బాయ్‌కాట్‌లను రాజకీయ వ్యూహంగా మార్చుకుంది. పార్లమెంట్‌లో కీలకమైన చర్చలను తప్పించుకుంటూ.. గందరగోళం సృష్టించేందుకు వీధుల్లో జనాలను సమీకరించుకుంటున్నారు" అని హరియాణాలో జరిగిన

తరువాయి 2లో..

లాస్ ఏంజెలెస్ మేయర్‌గా.. భారత సంతతి నిత్యా రామన్



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో భారత సంతతికి చెందిన మరో మహిళ సత్తా చాటుతున్నారు. లాస్ ఏంజెలెస్ మేయర్ పోటీలో ఉన్న కేరళ మూలాలున్న నిత్యా రామన్ విజయం దిశగా దూసుకెళ్తున్నారు. ప్రస్తుత మేయర్ కరేన్ బాస్‌కి గట్టి పోటీ

తరువాయి 2లో..

దేశవ్యాప్తంగా వందే భారత్ హవా..

నిండిపోతున్న సీట్లు, స్లీపర్లకు ఫుల్ డిమాండ్

తిరువనంతపురం-మంగళూరు రూట్‌లో 189% రికార్డు స్థాయి ఆక్యుపెన్సీ

తొలి వందే భారత్ స్లీపర్‌కు కూడా 114% పైగా ఆక్యుపెన్సీ నమోదు

బెంగళూరు-ముంబై మధ్య కొత్త స్లీపర్ రైలును ప్రకటించిన రైల్వే శాఖ

దేశవ్యాప్తంగా చైర్ కార్ రైళ్లలో దాదాపు 100% నిండుతున్న సీట్లు

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

దేశంలో ప్రవేశపెట్టిన సెమీ-హై-స్పీడ్ రైళ్లు వందే భారత్ సర్వీసులకు ప్రయాణికుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ రైళ్ల ఆక్యుపెన్సీ గణాంకాలు వాటి విజయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా, తిరువనంతపురం సెంట్రల్-మంగళూరు సెంట్రల్ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఏకంగా 189.35% ఆక్యుపెన్సీతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచి సరికొత్త రికార్డు సృష్టించింది. రైల్వే బోర్డు అధికారి వెల్లడించిన

తరువాయి 2లో..



మోదీ దేశద్రోహి అని ఐదు నిమిషాల్లో నిరూపిస్తా

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీ 'దేశద్రోహి' అని, ఆయన్ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్

తరువాయి 2లో..

గ్లోబల్ సమిట్‌లో టూరిస్ట్ స్పాట్లను ప్రదర్శించాలి: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, సిటిజన్ టైమ్స్

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్‌లో పాల్గొనే ప్రతినిధులకు లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతినిధుల రిజిస్ట్రేషన్, పాస్‌ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ప్రముఖ టూరిస్ట్

తరువాయి 2లో..

రూపాయికి రెక్కలు, చమురుకు బ్రేకులు..

అమెరికా ఎన్నికల ఫలితాలతో భారత్‌కు ఊరట!

వరుసగా ఐదో రోజు బలపడిన భారత రూపాయి

భారీగా పతనమైన ముడి చమురు ధరలు

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల గెలుపు ప్రభావం

ఇరాన్‌పై యుద్ధానికి ట్రంప్ వెనక్కి తగ్గే అవకాశం

సానుకూల సంకేతాలతో లాభాల్లో దూసుకెళ్లిన స్టాక్ మార్కెట్లు



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిణామాలతో భారత ఆర్థిక వ్యవస్థకు ఊరట లభించింది. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో భారత రూపాయి వరుసగా ఐదో రోజు కూడా లాభపడింది. అదే సమయంలో ముడి చమురు ధరలు భారీగా పతనమయ్యాయి. నేడు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 29 పైసలు

తరువాయి 2లో..

రాప్తాడు బాలికకు ఆపరేషన్ విజయవంతం

మంత్రి లోకేశ్

రాప్తాడు బాధితురాలికి ఆర్థోపెడిక్ సర్జరీ విజయవంతం

ప్లాస్టిక్ సర్జరీ బృందం కూడా పరిస్థితిని సమీక్ష

ప్రస్తుతం బాలిక పీఐసీయూలో చికిత్స

వైద్య బృందంతో టచ్‌లో ఉన్నామన్న మంత్రి లోకేశ్

తరువాయి 2లో..



ఇప్పుడు జరుగుతున్నవి ఎన్నికలేనా?: జగన్

తాడేపల్లి, సిటిజన్ టైమ్స్

ఇప్పుడు జరుగుతున్నవి ఎన్నికలేనా? అని వైకాపా అధ్యక్షుడు వై.ఎస్. జగన్ ప్రశ్నించారు. శకుని మాయాపాచికల మాదిరిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. అధికార దుర్వినియోగం, రౌడీయిజంతో ఎన్నికలు నిర్వహించారని

తరువాయి 2లో..



ఎడిటోరియల్

ఎలా గెలవాలో చెప్పారు...
జగన్ కంగ్రాట్స్ !

ఏపీలో చంద్రబాబు జగన్ ల మధ్య ఉన్నది కేవలం రాజకీయ వైరం అని ఎవరూ అనుకోరు. అది వ్యక్తిగత స్థాయిలో కూడా ఉందని భావించే వారూ నమ్మే వారూ ఉన్నారు. దానికి ఉదాహరణలు కూడా ఉన్నాయని చెబుతారు. ఈ ఇద్దరూ ఎక్కడా నేరుగా కలసిన సందర్భాలు లేవు, ఎవరు సీఎం గా ఉన్నా రెండవవారు ముఖం చాటేసే వైఖరినే ప్రదర్శిస్తూ వచ్చారు. అయితే సోషల్ మీడియా ద్వారా ఒకరి పుట్టిన రోజుకు మరొకరు శుభాకాంక్షలు మాత్రం చెప్పుకుంటారు. అంతవరకే అది. అలాంటిది నేరుగా చంద్రబాబుకు జగన్ కంగ్రాట్స్ చెబుతూ ట్వీట్ చేశారు అంటే అందులో చాలానే మ్యాటర్ ఉండాలిగా. అందుకే అంతా దాని గురించే విశ్లేషిస్తున్నారు. కంగ్రాట్స్ చంద్రబాబు గారూ అంటూ ఏపీలో అర్బన్ బాడీస్ ఎన్నికల్లో సక్సెస్ తరువాత జగన్ ట్వీట్ చేశారు. ఇది అందరినీ ఆకట్టుకుంది. బాబు గెలుపుకి ఆయన అసలైన రాజకీయ ప్రత్యర్థి జగన్ ఎలా కంగ్రాట్స్ చెబుతారు అని అని ఆలోచించేవారే ఎక్కువ. మరి ఆ కంగ్రాట్స్ వెనకనే ఎన్నో సెటైర్లు ఎన్నో కామెంట్స్ దట్టించి మరీ జగన్ వదిలారు. అదే ఇపుడు రాజకీయంగా వైరల్ అవుతోంది. చంద్రబాబుని ని ఒక టీం గా జగన్ చేశారు. ఆ టీం లో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉంది, అలాగే పోలీసు యంత్రాంగం ఉంది. అలా టీం చంద్రబాబుకు జగన్ కంగ్రాట్స్ చెప్పారన్న మాట. ఇది సెటైరికల్ గా గట్టిగా గుచ్చుకోవాలని అలాగే చర్చ సాగాలనే జగన్ ఈ ట్వీట్ వేశారు అని అంటున్నారు. అంతే కాదు ఎన్నికల్లో ఎలా గెలవాలో అన్నది బాబు అండ్ టీం క్లారిటీగా తెలియచెప్పింది అని జగన్ కామెంట్స్ చేశారు. అందులోనూ ప్రతిపక్షానికి పోటీ చేసేందుకు కనీసం అవకాశం ఇవ్వకుండా ఎలా చేయవచ్చూ ప్రతీ దశలోనూ చూపించారు అని కూడా కామెంట్స్ చేశారు. నామినేషన్ల దాఖలు దశ నుంచి హైజాక్ చేస్తూ వచ్చారని, స్క్రూటినీ, విత్ డ్రాయల్, పోలింగ్ ఏజెంట్లను బయటకు పంపించడం, రిగ్గింగ్ చేసుకోవడం, పోల్ పర్సెంటేజ్ ని కూడా మానేజ్ చేయడం, కౌంటింగ్ హైజాక్ చేయడం ఇవన్నీ కూడా గెలుపు ఎలా సాధించాలో చేసి చూపించారని జగన్ తన కంగ్రాట్స్ మెసేజ్ లోనే హాట్ కామెంట్స్ గా చెప్పుకొచ్చారు అన్న మాట. అందువల్ల అర్బన్ బాడీస్ కి జరిగినవి ఎన్నికలు కానే కాదని సెలెక్షన్ మాత్రమే అని జగన్ తేల్చేశారు. ప్రజలు ఎవరూ ఎన్నుకోలేదని కూడా జగన్ అంటున్నారు. ఇలాంటివి చూసినపుడు ఎన్నికల సంస్కరణల అవసరం ఎంత ఉందో మరింతగా అర్థం అవుతోంది అన్నట్లుగా జగన్ మాట్లాడారు. మొత్తానికి ఒక వైపు అర్బన్ బాడీస్ లో కూటమి విజయ పరంపర కొనసాగింది. వైసీపీ దారుణంగా ఓటమిని అందుకుంది. దీనికి జగన్ నుంచి వచ్చిన రియాక్షన్ ఇలా షాకింగ్ గానే ఉంది. ఓటమి ఎపుడూ బాధాకరంగానే ఉంటుంది. ప్రత్యర్థి గెలుపుని కూడా తక్కువ చేసి చూడడం జరుగుతుంది. వైసీపీ విషయం తీసుకుంటే తమకు చాన్స్ ఇవ్వలేదని ఆరోపిస్తోంది. అదే సమయంలో ఏపీలో పారదర్శకంగానే ఎన్నికలు జరిగాయని అధికార పక్షం అంటోంది. ఈ రెండు కామెంట్స్ కి మధ్యలో ప్రేక్షకులు మాత్రం ప్రజలు. వారికి అన్నీ తెలుసు. ఎవరేమి మాట్లాడినా అందులో ఎంత మేరకు నిజం ఉంది అన్నది ఇంకా బాగా తెలుసు అంటున్నారు.

గ్లోబల్ సమిట్‌లో టూరిస్ట్ స్పాట్లను ప్రదర్శించాలి: రేవంత్‌రెడ్డి

స్పాట్లను సమిట్‌లో ప్రదర్శించాలన్నారు. వాతావరణ మార్పులపై సదస్సులో చర్చ జరిగేలా చూడాలని, నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు తెలంగాణ ఎడ్యుకేషన్ ప్రతిబింబించేలా చర్చ జరగాలని దిశానిర్దేశం చేశారు. నవంబర్ 15 వరకు ఏర్పాట్ల ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీపై చర్చించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో జరగనున్న సదస్సుపై సమాలోచనలు చేశారు.

చంద్రబాబుపై కేసులు.. సీబీఐ విచారణ పిల్‌పై
హైకోర్టులో వాడివేడి వాదనలు

సవాలు చేశారు. ముఖ్యంగా ఎస్సీ/ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూముల బదలాయింపు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ టెండర్లలో అవకతవకలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు, ఇన్నర్ రింగ్ రోడ్ భూసేకరణ, ఎక్సైజ్ పాలసీ నిర్ణయాలు, ఉచిత ఇసుక విధానం రూపకల్పన వంటి కీలకమైన కేసుల దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరారు. దర్యాప్తు సమయంలో స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను సంబంధిత వ్యక్తులకు తిరిగి ఇవ్వకుండా విజయవాడ ఏసీబీ కోర్టును ఆదేశించాలని కోరుతూ ఒక మధ్యంతర పిటిషన్‌ను కూడా దాఖలు చేశారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది రంజిత్ వాదనలు వినిపిస్తూ, ఈ కేసుల్లో ఫిర్యాదుదారులుగా ఉన్నది ప్రభుత్వ అధికారులేనని, ప్రస్తుతం చంద్రబాబు అధికారంలో ఉండటంతో వారు కేసుల మూసివేత నివేదికలను సవాలు చేయడానికి ముందుకు రావడం లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో కేసులపై స్వతంత్ర దర్యాప్తు జరిగేలా చూడాలని కోర్టు జోక్యాన్ని కోరడం తప్ప పిటిషనర్‌కు మరో మార్గం లేదని ఆయన వాదించారు. కేసు స్టేటస్ చార్ట్ ప్రకారం, ఇప్పటికే పలు కేసుల్లో సీఐడీ క్లోజర్ రిపోర్టులు దాఖలు చేయగా, వాటిని కోర్టులు ఆమోదించాయని తెలిపారు. అసైన్డ్ భూముల కేసులో ఒక ఫిర్యాదుదారు, కేసు మూసివేతకు నిరభ్యంతర పత్రం (చీజ) ఇవ్వాలని సీఐడీ–సిట్ అధికారులు తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపిస్తూ నిరసన పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. పరిస్థితులను బట్టి దర్యాప్తును ఆదేశించే అధికారం రాజ్యాంగబద్ధమైన కోర్టుగా హైకోర్టుకు ఉందని, నిర్దోషిగా తేలిన తర్వాత కూడా లేదా నిష్పాక్షిక విచారణ కోసం కేసును సీబీఐకి బదిలీ చేయవచ్చని వాదించారు. గత నెల విచారణ సందర్భంగా ప్రభుత్వం, సీఐడీ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ మరోసారి వాదనలు వినిపించారు. ఈ పిల్‌ను కొట్టివేయాలని కోరారు. చంద్రబాబుపై నమోదైన కేసుల్లో తగిన ఆధారాలు లభించలేదని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విజయవాడ ఏసీబీ కోర్టులో తుది నివేదికలు దాఖలు చేసిందని ఆయన తెలిపారు. ఆ నివేదికలను పరిశీలించిన ఏసీబీ కోర్టు కేసులను మూసివేయాలని ఆదేశించిందని హైకోర్టుకు వివరించారు. ఈ కేసుల మూసివేతను సవాలు చేస్తూ కొందరు వ్యక్తులు ఇప్పటికే హైకోర్టులో రివిజన్ పిటిషన్లు దాఖలు చేశారని తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో, ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో విచారించడానికి ఇక ఏమీ మిగలలేదని, కాబట్టి ఈ పిల్‌ను నిరర్థకమైనదిగా పరిగణించి కొట్టివేయాలని రోహత్గీ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తదుపరి విచారణను వాయిదా వేసింది.

ఇప్పుడు జరుగుతున్నవి ఎన్నికలేనా?: జగన్

ఆక్షేపించారు. తాడేపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగన్ మాట్లాడారు. ఇవి ఎలక్షన్లో.. సెలక్షన్లో తెలియడం లేదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి రాబోయే తరాలకు తప్పుడు సందేశం ఇస్తున్నారని ఆరోపించారు. "పారదర్శకంగా ఎన్నికలు జరిగితే అడ్రస్ గల్లంతవుతుందని కూటమి నేతలు భయపడుతున్నారు. ఎన్నికలకు వెళ్లే ధైర్యం లేక ఏకంగా ఎన్నికలనే హైజాక్ చేశారు. అనేకచోట్ల నామినేషన్లు వేయకుండానే అడ్డుకున్నారు. ఒకవేళ వేసినా.. పరిశీలన పేరుతో తిరస్కరించారు. మా పార్టీ జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల్ని అక్రమంగా అరెస్టు చేశారు. పోలింగ్ ఏజెంట్లను బూత్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. పోలీసులతో కలిసి తెదేపా నేతలు రౌడీయిజం చేశారు. బూత్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు పెట్టాలని కోర్టు చెప్పినా అధికారులు వినిపించుకోలేదు" అని జగన్ అన్నారు.

రూపాయికి రెక్కలు, చమురుకు బ్రేకులు.. అమెరికా ఎన్నికల ఫలితాలతో భారత్‌కు ఊరట!

బలపడి 94.35 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. నిన్న ముగింపు ధర 94.64గా ఉంది. మరోవైపు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు నాలుగో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 1.16 డాలర్లు తగ్గి 93.46 డాలర్లకు చేరింది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) ధర కూడా 1.47 డాలర్లు పడిపోయి 86.65 డాలర్ల వద్ద నిలిచింది. ఈ వారంలో ఇప్పటివరకు చమురు ధరలు దాదాపు 16 శాతం మేర తగ్గడం గమనార్హం. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పార్టీకి ఎదురుదెబ్బ తగలడమే ఈ పరిణామాలకు ప్రధాన కారణం. కాంగ్రెస్‌లోని ఉభయ సభల్లోనూ డెమోక్రాట్లు విజయం సాధించడంతో ఇరాన్‌పై యుద్ధం విషయంలో ట్రంప్ దూకుడుకు కళ్లెం పడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి వెళ్లకుండా, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకునేందుకు ట్రంప్‌పై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ఇరాన్‌పై దాడి చేసే ఆలోచన ప్రస్తుతానికి లేదని స్వయంగా ట్రంప్ ప్రకటించడం కూడా మార్కెట్లకు ఊరటనిచ్చింది. ఈ సానుకూల సంకేతాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1600 పాయింట్లకు పైగా లాభపడి 78,910 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 417 పాయింట్లు పెరిగి 24,378 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టాయి.

దేశవ్యాప్తంగా వందే భారత్ హవా..

వివరాల ప్రకారం, దేశవ్యాప్తంగా నడుస్తున్న అన్ని వందే భారత్ చైర్ కార్ సర్వీసుల్లో కలిపి సగటు ఆక్యుపెన్సీ 99.10%గా నమోదైంది. జనవరి 2026లో ప్రారంభమైన తొలి వందే భారత్ స్లీపర్ రైలు (హౌరా–కామాఖ్య) కూడా ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ రైలులో ఏకంగా 114.54% ఆక్యుపెన్సీ నమోదైనట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తన కథనంలో పేర్కొంది.

రికార్డు స్థాయిలో ఆక్యుపెన్సీ వివరాలు:

ఆక్యుపెన్సీలో రికార్డు సృష్టించిన తిరువనంతపురం–మంగళూరు రూట్‌లో, తిరువనంతపురం నుంచి మంగళూరు వెళ్లే రైలు (20632) 189.35% ఆక్యుపెన్సీ నమోదు చేయగా, మంగళూరు నుంచి తిరువనంతపురం వచ్చే రైలు (20631) 174.77% ఆక్యుపెన్సీ సాధించింది. 100% కంటే ఎక్కువ ఆక్యుపెన్సీ ఉండటం అంటే, అందుబాటులో ఉన్న సీట్ల కంటే ఎక్కువ మంది ప్రయాణికులు వెయిటింగ్ లిస్ట్‌లో ఉండి ప్రయాణించడానికి సిద్ధంగా ఉన్నారని అర్థం. ఇది ఈ రూట్లలో డిమాండ్ ఏ స్థాయిలో ఉందో సూచిస్తోంది. అదేవిధంగా, ఢిల్లీ–వారణాసి మధ్య నడిచే రెండు జతల వందే భారత్ చైర్ కార్ సర్వీసులు కూడా 114% నుంచి 117% పైగా ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి.

కొత్తగా స్లీపర్ సర్వీసులు:


వందే భారత్ రైళ్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ మరిన్ని స్లీపర్ సర్వీసులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. కర్ణాటకకు రెండో వందే భారత్ స్లీపర్ రైలును కేటాయించినట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల ప్రకటించారు. ఈ రైలు బెంగళూరు నుంచి హుబ్బళ్లి మీదుగా ముంబై వరకు నడవనుంది. దీనివల్ల ఉత్తర కర్ణాటక, పుణె, ముంబై నగరాల మధ్య ప్రయాణం సులభతరం కానుంది. కాగా, ఢిల్లీ–వారణాసి మార్గంలో అక్టోబర్ 31, 2026న ఒక వందే భారత్ స్లీపర్ రైలును ఇప్పటికే ప్రారంభించారు. 2019లో ప్రారంభమైన వందే భారత్ సేవలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 160కి పైగా సర్వీసులకు విస్తరించాయి. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (×జఖీ)లో ఈ ఆధునిక రైళ్లను తయారు చేస్తున్నారు.

అవినాష్ రెడ్డి ఆరోపణల్లో వాస్తవం లేదు.. నిరూపిస్తే ఆధారాలు చూపించాలి: బీటెక్ రవి

ఎన్నికల ఓటమిని జీర్ణించుకోలేక పోలీసులపై నిందలు వేస్తున్నారు.. వైసీపీ ఆరోపణలు అవాస్తవం

పులివెందుల, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):

ఎన్నికల్లో అక్రమాలు, రిగ్గింగ్ జరిగాయంటూ వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి విమర్శించారు. గురువారం అవినాష్ రెడ్డి చేసిన ఆరోపణలకు కౌంటర్‌గా ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఏదో ఒక అంశాన్ని తెరపైకి తీసుకొచ్చి ప్రెస్‌మీట్లు పెట్టడం అవినాష్ రెడ్డికి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. లింగాల మండలంలో రిగ్గింగ్ లేదా ఇతర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తే, అందుకు సంబంధించిన ఆధారాలను చూపించాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో చిన్నచిన్న ఘటనలు జరిగినా పోలీసు శాఖను, అధికారులను లక్ష్యంగా చేసుకుని



విమర్శలు చేయడం సరికాదన్నారు. పోలీసులు టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలను ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన ఎన్నికల ఫలితాలను జీర్ణించుకోలేకే వైసీపీ నేతలు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వార్నపల్లెలో రిగ్గింగ్ జరగలేదని, వైసీపీ వాహనాలను టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారన్న ఆరోపణల్లోనూ నిజం లేదని పేర్కొన్నారు. మరోవైపు ఎర్రవల్లి, నలిపిరెడ్డిపల్లి గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలకు చెందిన ఇన్నోవా వాహనాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఓటమిని కప్పిపుచ్చుకునేందుకు రిగ్గింగ్ జరిగిందనే భావన కల్పిస్తూ పోలీసు శాఖపై, టీడీపీ నాయకులపై నిందలు వేస్తున్నారని బీటెక్ రవి విమర్శించారు. రీపోలింగ్ కోరడం, సీసీ ఫుటేజీ పరిశీలించాలని ఎన్నికల సంఘాన్ని కోరడం, అవసరమైతే కోర్టుకు వెళ్తామని ప్రకటించడం వంటి వ్యాఖ్యలు రాజకీయ ఆరోపణల్లో భాగమని ఆయన పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

ఆ సమాధానాలు తట్టుకోలేక పారిపోతారు
రాహుల్‌పై అమిత్‌షా ధ్వజం

సభలో అమిత్ షా మండిపడ్డారు. హరియాణాలోని కర్నాల్ ప్రాంతంలో అమిత్‌షా, ఇతర కీలక నేతలంతా 'లోక్‌తంత్ర బచావో, అరాజకతా హఠావో' పేరిట పాదయాత్రలో పాల్గొన్నారు. సర్‌పై చర్చించేందుకు పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర హోంమంత్రి స్పష్టం చేశారు. "2014లో సర్ ఉందా..? అయినా సరే మీ పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. 2019, 2024లోనూ మీకదే పరిస్థితి. అప్పుడు కూడా సర్ లేదు. వీధుల్లో జనాలను సమీకరించే ప్రయత్నాలను రాహుల్ కొనసాగిస్తే.. భాజపా నుంచి తగిన సమాధానం వస్తుంది" అని పేర్కొన్నారు. దేశాన్ని అస్థిరపరిచేందుకు విపక్షాలు విదేశీ శక్తుల సాయం తీసుకుంటున్నాయంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు రావాలని రాహుల్ డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. మోదీయే విదేశీ శక్తుల అండతో ప్రధాని పీఠాన్ని కాపాడుకుంటున్నారని విమర్శించారు. లోక్‌సభలో చర్చ అంటారుకానీ తాను మాట్లాడకుండా మైక్ కట్ చేస్తారని ఆరోపించారు.

మోదీ దేశద్రోహి అని ఐదు నిమిషాల్లో నిరూపిస్తా

నియంత్రిస్తున్నారని, తనతో చర్చకు వస్తే ఆ విషయాన్ని 5 నిమిషాల్లో నిరూపిస్తానని పేర్కొన్నారు. ఈ అంశంపై చర్చకు రావాలని ప్రధానికి సవాల్ విసిరితే పార్లమెంటులో చర్చిద్దామని ఎన్డీయే నేతలు అంటున్నారని చెప్పారు. కానీ లోక్‌సభలో తాను మాట్లాడకుండా మైక్ కట్ చేస్తారని రాహుల్ తెలిపారు. దేశంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు షా మూడేళ్ల గడువు పెట్టారని, అయితే అప్పటికి ఆయన ఆ పదవిలో ఉంటారో? లేదో? అని ఎద్దేవా చేశారు. తన అంచనా ప్రకారం ఏడాదిలోపే ప్రభుత్వం కూలిపోతుందని కీలక వ్యాఖ్యలు చేశారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో బుధవారం జరిగిన ఇన్సాఫ్ ర్యాలీలో రాహుల్ మాట్లాడారు.. "నేను అమిత్ షాను ఒక్కటే అడగాలనుకుంటున్నా. అదానీ ఓడరేవులో పట్టుబడిన మాదకద్రవ్యాల సంగతేంటి? ఆ విషయంలో మీరు తీసుకున్న చర్యలేమిటి? మీరు శాంతిభద్రతల గురించి మాట్లాడుతున్నారు. మీరు గ్యాంగ్‌స్టర్లను ప్రోత్సహిస్తున్నారని దేశం మొత్తానికి తెలుసు. ఒకవేళ మీరు శాంతిభద్రతల గురించి మాట్లాడాలనుకుంటే, మణిపుర్‌లో ఏం జరుగుతుందో దేశానికి చెప్పండి" అని రాహుల్ అన్నారు.

పంజాబ్‌లో ఆ హామీలు ఏమయ్యాయి?

పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆప్ పైనా రాహుల్ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఆప్ అధికారంలోకి వచ్చిన తర్వాత, డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలిస్తామని భగవంత్ మాన్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. వారు ఎక్కడ నిర్మూలించారు? పంజాబ్‌లో ఏ ఒక్క ప్రాంతం నుంచైనా వారు డ్రగ్స్‌ను తొలగించగలిగారా? ఈ సమస్యను అంతం చేసే సామర్థ్యం వారికి లేదు అని ధ్వజమెత్తారు. గతంలో లోక్‌సభలో భగతంత్ మాన్‌తో కలిసి కూర్చున్న సమయంలో ఆయన జోకులు వేసేవారు. ఆయన వద్ద మద్యం వాసన వచ్చేదని రాహుల్ ఆరోపించారు. మాదక ద్రవ్యాలపై పోరాడలనుకుంటే ముఖ్యమంత్రి మద్యం మత్తులో ఉండకూడు కదా అంటూ మాన్‌కు రాహుల్ చురకలంటించారు. సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సచిన్ పైలట్ పాల్గొన్నారు.

రాప్తాడు బాలికకు ఆపరేషన్ విజయవంతం

అమరావతి, సిటిజన్ టైమ్స్:

ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన రాప్తాడు బాలికకు నిర్వహించిన ఆర్థోపెడిక్ సర్జరీ విజయవంతమైంది. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. బాలికకు అత్యుత్తమ వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ప్రస్తుతం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు వైద్యులు ఆర్థోపెడిక్ సర్జరీ పూర్తి చేశారని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఆపరేషన్ థియేటర్‌లోనే ప్లాస్టిక్ సర్జరీ బృందం కూడా బాలిక పరిస్థితిని సమీక్షించిందని తెలిపారు. సర్జరీ అనంతరం బాలికను పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ)కు తరలించారని, ప్రస్తుతం బాలిక క్షేమంగా ఉందని వివరించారు. బాలికకు సాధ్యమైనంత ఉత్తమ వైద్య సంరక్షణ అందించేందుకు వైద్య బృందంతో నిరంతరం టచ్‌లో ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. రాప్తాడుకు చెందిన హేమంత్ అనే వ్యక్తి దాడిలో బాలిక తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రభుత్వం బాలిక వైద్య ఖర్చులను పూర్తిగా భరిస్తూ, ఆమె ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తోంది.

లాస్ ఏంజెలెస్ మేయర్‌గా.. భారత సంతతి నిత్యా రామన్

ఇస్తున్న ఆమె.. సుమారు 26 వేల ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. అమెరికాలో రెండో అతిపెద్ద నగరానికి ప్రాతినిధ్యం వహించేందుకు రామన్‌కే ఎక్కువ అవకాశాలున్నాయని అమెరికా మీడియా సంస్థలు అంచనా వేస్తున్నాయి.

ఎవరీ నిత్యా రామన్..?..: నిత్యా రామన్ 1981 జులై 28న కేరళలో జన్మించారు. తండ్రి వెంకటరత్నం ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగి.. తల్లి సుధ బ్యాంకు ఉద్యోగి. ఆరేళ్ల వయసున్నప్పుడే తల్లిదండ్రులతో కలిసి నిత్య అమెరికాకు వలస వెళ్లారు. బోస్టన్‌లో పెరిగిన ఆమె.. హార్వర్డ్ యూనివర్సిటీలో బ్యాచిలర్ డిగ్రీ, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి మాస్టర్స్ చేశారు. భర్త వాలీ చంద్రశేఖరన్ స్థానికంగా పేరొందిన టెలివిజన్ రచయిత, ప్రొడ్యూసర్. 2013లో లాస్ ఏంజెలెస్‌కు వెళ్లి స్థిరపడ్డారు. వీరికి కర్ణ, కావేరి కవల పిల్లలున్నారు. హాలీవుడ్‌లో సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే నిత్య.. భారత్‌లోనూ కొన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేశారు. 2020లో లాస్ ఏంజెలెస్ సిటీ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన ఆమె.. ఆరేళ్లపాటు సభ్యురాలిగా సేవలందించారు. అందుబాటు ధరలో గృహాల లభ్యత, నిరాశ్రయులు, అద్దెదారుల హక్కులు, పౌరుల భద్రత, నగరంలో మెరుగైన సేవల కోసం కృషి చేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తాజా ఎన్నికల్లో సత్తా చాటి లాస్ ఏంజెలెస్‌కు తొలి భారత సంతతి మేయర్‌గా సేవలందించేందుకు సిద్ధమవుతున్నారు.

ఖాకీ ఖడ్గమే కాదు.. కరుణకు ప్రతిరూపం!

నడవలేని వృద్ధురాలికి వీల్‌చైర్ ఆసరా.. ఓటు హక్కు వినియోగానికి సీఐ ఎర్రం నాయుడు చేయూత

ఆనందపురం, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్ ప్రత్యేక కథనం):
పోలీసులంటే కేవలం నేరస్తులపై ఉక్కుపాదం మోపడం, శాంతిభద్రతలను పరిరక్షించడం మాత్రమే కాదు.. అవసరమైన సమయంలో ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి, మానవత్వాన్ని చాటుకోవడం కూడా తమ బాధ్యతేనని ఆనందపురం పోలీస్ స్టేషన్ సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు నిరూపించారు. పరిషత్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఆయన చూపిన మానవీయ స్పందన అందరి హృదయాలను హత్తుకుంది.

వృద్ధురాలి కష్టం చూసి చలించిన ఖాకీ గుండె!
జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల విధుల్లో భాగంగా పోలింగ్ కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న సీఐ ఎర్రం నాయుడు నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిని గమనించారు. వయోభారం, శారీరక ఇబ్బందులతో అడుగు ముందుకు వేయలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ, తన ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఆమె సంకల్పాన్ని గుర్తించారు. వెంటనే మానవతా దృక్పథంతో స్పందించి, స్వయంగా ఆమెకు సహాయం అందించారు. వీల్‌చైర్‌పై కూర్చోబెట్టి పోలింగ్ కేంద్రం వరకు తీసుకెళ్లి, ఆమె ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన సహకారం అందించారు.

హోదాను పక్కనపెట్టి.. సేవే లక్ష్యంగా!
ఎన్నికల సమయంలో పోలీసు అధికారులకు ఎన్నో బాధ్యతలు ఉంటాయి. బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పర్యవేక్షణ వంటి విధుల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, తన ముందున్న ఓ వృద్ధురాలి ఇబ్బందిని గుర్తించి స్వయంగా సహాయం చేయడం సీఐ సేవాభావానికి నిదర్శనంగా నిలిచింది. అధికారం, హోదా కంటే మానవత్వమే గొప్పదని ఆయన తన చేతలతో చాటిచెప్పారు.

ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం ఇదే!
ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు. వయస్సు, శారీరక వైకల్యం, ఇతర ఇబ్బందులు ఆ హక్కును వినియోగించుకోవడానికి అడ్డంకులు కాకూడదు. వృద్ధులు, దివ్యాంగులు సైతం స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సహకరించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంతో కీలకం. ఈ దిశగా ఆనందపురం సీఐ చూపిన చొరవ అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తోంది.



ప్రశంసలు అందుకుంటున్న మానవీయ సేవ!
సాధారణంగా పోలీసుల విధులను కఠినత్వంతో ముడిపెడుతుంటారు. కానీ ఖాకీ దుస్తుల వెనుక ఓ సున్నితమైన మనసు, ప్రజల పట్ల బాధ్యత, ఆప్యాయత కూడా ఉంటాయని ఈ సంఘటన మరోసారి నిరూపించింది. వృద్ధురాలికి అండగా నిలిచిన సీఐ ఎర్రం నాయుడు చర్య పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ఖాకీ దుస్తులు ధరించిన చేతులు నేరస్తులను నియంత్రించడమే కాదు.. అవసరమైనప్పుడు ఆప్యాయతతో ఆసరాగా కూడా నిలుస్తాయి. ప్రజల రక్షణతో పాటు వారి హక్కులకు భరోసా కల్పించినప్పుడే పోలీసు సేవకు నిజమైన సార్థకత చేకూరుతుంది. ఆనందపురం సీఐ ఎర్రం నాయుడు చూపిన ఈ మానవత్వం పోలీసు వ్యవస్థకు గర్వకారణం.. సమాజానికి స్ఫూర్తిదాయకం!.



నాలుగు మండలాల్లో పరిషత్ ఎన్నికల పోలింగ్‌ను పరిశీలించిన కలెక్టర్

పోలింగ్ సరళిపై నిరంతర సమీక్ష..

అధికారులకు కీలక ఆదేశాలు



విశాఖపట్నం, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్)
విశాఖ జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. గురువారం భీమిలి, పద్మనాభం, ఆనందపురం, పెందుర్తి మండలాల పరిధిలో కొనసాగిన పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకతతో పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలను నిరంతరం పర్యవేక్షించాలని, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా పద్మనాభం మండలం మద్ది హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ నిర్వహణ తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ, పోలింగ్ ముగిసే వరకు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించిన గంటా శ్రీనివాసరావు

నాలుగు పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులపై సమీక్ష..

కూటమి నాయకులతో చర్చ



విశాఖపట్నం, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):
భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సరళిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆనందపురం మండలంలోని ఆనందపురం, బోని, పద్మనాభం మండలంలోని కృష్ణాపురం, భీమిలి మండలంలోని లక్ష్మీపురం పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులను సమీక్షించారు. ఆయా ప్రాంతాల్లో ఓటింగ్ సరళి, పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులపై కూటమి నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో వైసీపీ నాయకులు గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని కూటమి నాయకులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. అధికారులు, పోలీసుల సహకారం తీసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్‌తో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని, పరిషత్ ఎన్నికల్లో అంతకుమించిన విజయాన్ని నమోదు చేయాలని కూటమి శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివస్తున్నారని కూటమి నాయకులు గంటా శ్రీనివాసరావుకు వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పుడు, డి.ఎ.ఎన్. రాజు, తాట్రాజు అప్పారావు, మీసాల సత్యనారాయణ, సూరాల సత్య వరప్రసాద్, కె. రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్!

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా ఎన్నికల ప్రక్రియ

బ్యాలెట్ బాక్సులతో రిసెప్షన్ కేంద్రానికి చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది

పాడేరు, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):
అల్లూరి సీతారామరాజు జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగింది. పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బంది బ్యాలెట్ బాక్సులతో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి చేరుకుంటున్నారు. అక్కడ ఎన్నికల సిబ్బంది నుంచి అధికారులు బ్యాలెట్ బాక్సులను స్వీకరిస్తున్నారు. బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.





జీవీఎంసీలో కొత్త పాలనకు ముహూర్తం ఖరారు!

ఈ నెల 23న కొలువుదీరనున్న నూతన పాలకవర్గం

కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారంతో పాటు డిప్యూటీ మేయర్ ఎన్నికకు రంగం సిద్ధం


విశాఖపట్నం, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):
విశాఖ నగర పాలనలో మరో కీలక ఘట్టానికి సమయం ఆసన్నమైంది. గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థలో నూతన ప్రజాప్రతినిధుల పాలన ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 23వ తేదీన నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అదే రోజున డిప్యూటీ మేయర్ ఎన్నిక కూడా చేపట్టనుండటంతో నగర రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ నెలకొంది. ఇటీవల జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో ప్రజల తీర్పుతో ఎన్నికైన 120 మంది కార్పొరేటర్లు ఈ కార్యక్రమంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రజల తరఫున నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు వంటి కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే కొత్త పాలకవర్గం అధికారికంగా కార్యాచరణలోకి రానుంది. మరోవైపు డిప్యూటీ మేయర్ ఎన్నిక కూడా అదే రోజు నిర్వహించనుండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తొలుత ఈ నెల 9వ తేదీన డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించనున్నట్లు ప్రకటించినప్పటికీ, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం అనంతరమే ఎన్నిక ప్రక్రియ చేపట్టాల్సి ఉండటంతో ఈ నెల 23వ తేదీని ఖరారు చేసినట్లు సమాచారం. ఈ ప్రక్రియలో భాగంగా నవంబర్ 18న ప్రత్యేక సమావేశానికి సంబంధించిన నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. సమావేశ నిర్వహణ, ఎన్నికల విధివిధానాలు, ఇతర ఏర్పాట్లపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారిస్తున్నారు.

డిప్యూటీ మేయర్ పీఠంపై ఆసక్తికర చర్చ
కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం కంటే డిప్యూటీ మేయర్ ఎన్నికపైనే రాజకీయ వర్గాల్లో ప్రత్యేక ఆసక్తి కనిపిస్తోంది. మేయర్ ఎన్నిక అనంతరం డిప్యూటీ మేయర్ పదవి ఎవరికి దక్కుతుందన్న అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వివిధ రాజకీయ పార్టీల వ్యూహాలు, అంతర్గత సమీకరణాలు ఈ ఎన్నికలో కీలకంగా మారే అవకాశముంది. నవంబర్ 23న జరిగే ఈ కార్యక్రమంతో జీవీఎంసీలో నూతన పాలనకు అధికారికంగా శ్రీకారం చుట్టనుండగా, నగర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త పాలకవర్గం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే బండారు



కొత్తపేట సిటిజన్ టైమ్స్ నవంబర్ 5
పరిషత్ ఎన్నికల నేపథ్యంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం వాడపాలెంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో విలువైనదని, తమ ఓటు ద్వారా సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు.

ఓటు హక్కును వినియోగించుకున్న టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి సరళాదేవి

సాయంత్రం 5 గంటల్లోపు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి


పులివెందుల, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):



లింగాల మండలం ఇంటిఓబాయపల్లి (ఇంటేపల్లి) గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో గురువారం తెలుగుదేశం పార్టీ లింగాల జెడ్పీటీసీ అభ్యర్థి యమ్మనూరు సరళాదేవి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పని సరిగా వినియోగించుకోవాలని కోరారు. సాయంత్రం 5 గంటలలోపు ఓటర్లు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు చేరుకుని క్యూలో నిలబడి తమ అమూల్యమైన ఓటును వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగాన్ని వదిలి ప్రజాసేవకు వచ్చిన మేడి శెట్టి విజయ్‌కు ఘన సత్కారం

గాజువాక, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):
స్టీల్ ప్లాంట్ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన 103వ వార్డు కూటమి అభ్యర్థి, జనసేన పార్టీ నాయకులు మేడి శెట్టి విజయ్‌ను 99వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు సిరసపల్లి కనకరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజలకు చేరువ చేయాలని ఆకాంక్షించారు. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న విజయ్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సూరి అప్పారావు, కోరుకొండ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



నగర పారిశుధ్యంపై కమిషనర్ ప్రత్యేక దృష్టి

తుఫాను వ్యర్థాలను తక్షణమే తొలగించాలి –బీచ్ పరిసరాల్లో రాత్రింబవళ్లు పరిశుభ్రత పనులు చేపట్టాలి

సీఐఐ సమ్మిట్ నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణకు ఆదేశాలు





విశాఖపట్నం, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):

విశాఖ నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రధాన రహదారులు, బీచ్ పరిసరాల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని, ఇటీవల తుఫాను కారణంగా పేరుకుపోయిన చెట్ల కొమ్మలు, ఇతర వ్యర్థాలను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. గురువారం జీవీఎంసీ ఈస్ట్ జోన్ పరిధిలోని సిరిపురం జంక్షన్, బాలాజీనగర్, పార్క్ హోటల్ జంక్షన్ నుంచి ఆర్కే బీచ్ వరకు కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులు, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల తరలింపు ప్రక్రియను ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్, సహాయక వైద్యాధికారి బి. ప్రసాద్ రావుతో కలిసి పరిశీలించారు. సిరిపురం, బాలాజీనగర్ ప్రాంతాల్లో తుఫాను కారణంగా నేలకొరిగిన చెట్ల కొమ్మలు, పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించకపోవడంపై అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం చేపట్టడంతో పాటు సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. చెత్త పేరుకుపోయే ప్రాంతాలు ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు. త్వరలో విశాఖపట్నంలో సీఐఐ సమ్మిట్ జరగనున్న నేపథ్యంలో జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు నగరాన్ని సందర్శించనున్నారని కమిషనర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యంగా బీచ్ రోడ్డు, ఆర్కే బీచ్ పరిసరాలను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. రాత్రి వేళల్లో కూడా పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు తమ పరిధిలో పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బీచ్ ప్రాంతంలో పరిశుభ్రతకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సహాయక వైద్యాధికారి బి. ప్రసాద్ రావుకు కమిషనర్ సూచించారు.

వైసీపీకి షాక్.. జనసేనకు జోష్!

35వ వార్డు కీలక నేత గురజాపు రవి జనసేనలో చేరిక

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో

పార్టీ కండువా కప్పుకున్న గురజాపు రవి



విశాఖపట్నం, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జనసేన పార్టీకి మరింత బలం చేకూరింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 35వ వార్డు అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి గురజాపు రవి జనసేన పార్టీలో చేరారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో ఆయన జనసేన కండువా కప్పుకున్నారు. కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురజాపు రవికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గురజాపు రవి మాట్లాడుతూ.. దక్షిణ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ప్రశంసించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇటీవల జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్ నాయకత్వంలో పనిచేయడం తనకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రసాద్, జనసేన నాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు కార్పొరేటర్లకు కొణతాల ఘన సత్కారం!

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ

వార్డుల అభివృద్ధికి కృషి చేయాలి

కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



అనకాపల్లి, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):

అనకాపల్లి జోన్ పరిధిలో ఇటీవల జరిగిన జీవీఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన ఆరుగురు కార్పొరేటర్లకు మాజీ మంత్రి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఘనంగా సత్కరించారు. జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజయం సాధించిన కార్పొరేటర్లకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ.. ఎన్నికల్లో విజయం సాధించడం కేవలం పదవి మాత్రమే కాదని, అది ప్రజలు అప్పగించిన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన కార్పొరేటర్లు తమ తమ వార్డుల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజల నుంచి లభించిన ఆదరణ, సహకారాన్ని ఎప్పటికీ గుర్తుంచుకోవాలని, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాలని కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆరుగురు కార్పొరేటర్లకు మరోసారి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి భవిష్యత్ ప్రజాసేవా కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పట్టణ కూటమి నాయకులు, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఐఐ సదస్సు ఏర్పాట్లు ఆకర్షణీయంగా ఉండాలి

అంతర్జాతీయ ప్రతినిధులకు విశాఖ అందాలు కనిపించేలా ప్రత్యేక ఏర్పాట్లు

ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో

పనులను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):

విశాఖ నగరంలో నవంబర్ 11, 12, 13 తేదీల్లో నిర్వహించనున్న కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా, ఆకర్షణీయంగా పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సదస్సు నిర్వహణ కోసం చేపడుతున్న పనులను వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సదస్సు ప్రాంగణం లేఅవుట్, ప్రధాన ప్రవేశ ద్వారం, ల్యాండ్‌స్కేపింగ్, ఫౌంటెన్లు, ఆకర్షణీయమైన శిల్పాలు, రహదారుల మధ్య ఐలాండ్ల సుందరీకరణ, పెయింటింగులు, మొక్కల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ బ్లాక్, వీవీఐపీ పార్కింగ్, సాధారణ పార్కింగ్ ప్రాంతాలు, బారికేడింగ్, వాహనాల రాకపోకల మార్గాలు, సూచిక బోర్డులు, హోర్డింగులు, విద్యుత్ దీపాలు, గ్రీన్ కార్పెట్, రెడ్ కార్పెట్ ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రోడ్లు, ఫుట్‌పాత్‌లకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కమిషనర్ సూచించారు. ప్రధాన రహదారుల వెంట విద్యుత్ స్తంభాలకు రంగులు వేయడంతో పాటు, తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. నగరంలోని ప్రధాన రహదారులు, సదస్సు పరిసర ప్రాంతాలను పచ్చదనం, ల్యాండ్‌స్కేపింగ్, అందమైన పెయింటింగులతో సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సీఐఐ సదస్సు విశాఖ నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు, పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, నూతన అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేసే కీలక వేదికగా నిలుస్తుందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి పనిని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ నాణ్యత, ఆకర్షణీయతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజు, వీఎంఆర్డీఏ ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, సీఐఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హెడ్ మహేష్, సీఐఐ ఆర్గనైజర్ మౌళి, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ కె. శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ జాన్ సుధాకర్, ట్రాఫిక్ పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ ఎం. శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ డీఎఫ్ఓ రమణమూర్తి, జీవీఎంసీ డీటీఓ,హెచ్ వాసుకి తదితర అధికారులు పాల్గొన్నారు.



101 కొబ్బరికాయలతో మొక్కు చెల్లింపు.. గోపాలరెడ్డి నగర్ దుర్గమ్మ ఆలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు!

ఐదోసారి కార్పొరేటర్‌గా గెలిచిన గంధం

శ్రీనివాసరావుకు కార్యకర్త కొయ్య శ్రీధర్ ప్రత్యేక మొక్కు



పెదగంట్యాడ, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):

జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోని గోపాలరెడ్డి నగర్‌లో కొలువుదీరిన శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 96వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఇటీవల జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో వార్డు ప్రజల ఆదరణతో గంధం శ్రీనివాసరావు మరోసారి ఘన విజయం సాధించారు. వరుసగా ఐదుసార్లు కార్పొరేటర్‌గా ఎన్నికై, ఓటమి ఎరుగని నాయకుడిగా గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలో ఆయన విజయాన్ని కాంక్షిస్తూ మొక్కుకున్న పార్టీ కార్యకర్త కొయ్య శ్రీధర్ అమ్మవారి సన్నిధిలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వార్డు ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత బాధ్యతతో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు జిత్తుక అప్పలరాజు, సెక్రటరీ కూన వెంకట్రావు, శివ, భార్గవ్, శ్రీధర్, కుమార్, సుదర్శన్, అయ్యప్ప, వెంకన్న తదితర నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశాఖలో 4డి డెంటల్ లాంజ్ ఐదో శాఖ ప్రారంభం

నాణ్యమైన దంత వైద్యం అందరికీ అందుబాటులోకి

రావాలి: రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు



విశాఖపట్నం, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):

విశాఖలోని అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో ఎరుకుమాంబ దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన 'శ్రీ షిర్డీ సాయి 4డి డెంటల్ లాంజ్' ఐదవ శాఖను రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన దంత వైద్య సేవలను అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. విశాఖలో ఈ కేంద్రం ప్రముఖ దంత వైద్య కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ఒరిస్సా స్టీవ్ డోర్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ జె.కె. నాయక్ ఈ కేంద్రం సేవలను ప్రశంసించారు. డాక్టర్ డి. సుధాకర్ పట్నాయక్ మాట్లాడుతూ, డాక్టర్ అనూష దబ్బీరు 2012లో ప్రారంభించిన 4డి డెంటల్ సేవలు ప్రస్తుతం విశాఖలో ఐదు శాఖలకు విస్తరించాయని తెలిపారు. అందుబాటు ధరల్లో నాణ్యమైన చికిత్సతో పాటు అర్హులైన ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వి. మన్మధరావు, డాక్టర్ అజిత్ కుమార్ దబ్బీరు, డాక్టర్ పృథ్వీరాజ్ అంబటి, శ్రీమతి సుజాత తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికలపై జేసీ నిశిత నిఘా.. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచే నిరంతర పర్యవేక్షణ!

పోలింగ్ సరళిపై ఎప్పటికప్పుడు సమీక్ష.. క్షేత్రస్థాయి అధికారులకు అప్రమత్తత ఆదేశాలు



విశాఖపట్నం, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):

జిల్లాలో పరిషత్ ఎన్నికల నిర్వహణను జిల్లా యంత్రాంగం అత్యంత పకడ్బందీగా పర్యవేక్షించింది. భీమిలి, పద్మనాభం, ఆనందపురం, పెందుర్తి మండలాల పరిధిలో నిర్వహించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సరళిని జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితులు, ఓటర్ల స్పందన, ఎన్నికల నిర్వహణ తీరుపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ క్షేత్రస్థాయి అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ ప్రక్రియలో ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులను అప్రమత్తం చేశారు. జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో సందీప్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ యోగిత తదితరులు కంట్రోల్ రూమ్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకున్నారు. పోలింగ్ కేంద్రాల పరిస్థితులు, ఓటింగ్ పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సేకరిస్తూ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకతతో జరిగేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని, పోలింగ్ ముగిసే వరకు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.

జర్రావారిపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధం: చింతల

వాల్మీకిపురం, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లిలో గురువారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన క్యూలైన్‌లో నిలబడి ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, స్థానిక కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పటిష్ట పోలీసు భద్రత మధ్య ప్రశాంతంగా ముగిసిన పరిషత్ ఎన్నికలు

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా.. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతర పహారా

విజయనగరం, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):
జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పటిష్ట పోలీసు భద్రత మధ్య ప్రశాంతంగా ముగిసింది. పోలీసుశాఖ ముందస్తు ప్రణాళికతో చేపట్టిన భద్రతా చర్యలు, నిరంతర పర్యవేక్షణతో చిన్నచిన్న సంఘటనలు మినహా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఐపీఎస్ తెలిపారు. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి రూట్ మొబైల్ పార్టీలు, స్టైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్టైకింగ్ ఫోర్స్, జోనల్ స్టైకింగ్ ఫోర్స్‌లను అప్రమత్తంగా ఉంచినట్లు ఎస్పీ వెల్లడించారు. వైర్‌లెస్ వ్యవస్థ ద్వారా క్షేత్రస్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు, ఆదేశాలు జారీ చేయడం వల్ల భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయగలిగామని పేర్కొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా
పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్లను క్రమబద్ధీకరించారు. పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో



అనధికార వ్యక్తుల సంచారాన్ని నియంత్రించారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి అదనపు పోలీసు బలగాలను మోహరించారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లలో పికెట్లు ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగించారు. రూట్ మొబైల్ పార్టీలు, ప్రత్యేక పోలీసు బలగాలు పరస్పర సమన్వయంతో విధులు నిర్వహిస్తూ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నాయని ఎస్పీ వివరించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత
పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. బ్యాలెట్ బాక్సుల భద్రత కోసం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతర పోలీసు పహారా ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టి భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఎన్నికల విధులను సమన్వయంతో, బాధ్యతాయుతంగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సహకరించిన ప్రతి ఒక్కరికీ, ఎన్నికల నిర్వహణకు తోడ్పడిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

గంటా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసిన కార్పొరేటర్లు

కార్పొరేటర్ టికెట్లు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపిన విజేతలు.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని గంటా సూచన



విశాఖపట్నం, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):
భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును టీడీపీ, బీజేపీ తరపున కార్పొరేటర్లుగా ఎన్నికైన పలువురు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ కార్పొరేటర్లుగా గెలుపొందిన గాడు చిన్ని కుమారి లక్ష్మి (3వ వార్డు), పీవీ నరసింహం (120వ వార్డు), గరే జ్యోతి (10వ వార్డు), పాసి సుస్మిత (4వ వార్డు), పిల్లా రేవతి (8వ వార్డు), బీజేపీ కార్పొరేటర్ పరశురామరాజు (54వ వార్డు) గంటా శ్రీనివాసరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకంతో కార్పొరేటర్ టికెట్లు కేటాయించినందుకు గంటా శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని, పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు మద్దతు తెలుపుతున్నారని, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేశాయని ఆయన పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పిల్లా శివకృష్ణ, పిల్లా నరసింగరావు, గాడు యశ్వంత్, గరే గుర్నాథ్, పాసి త్రినాథ్, పంచదార్ల శ్రీనివాస్, గునిడి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సరళిని పరిశీలించిన కలెక్టర్!

పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల తనిఖీ
సిబ్బంది, ఏజెంట్లను వివరాలు అడిగి తెలుసుకున్న స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):
జిల్లాలో జరుగుతున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సరళిని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా ఎచ్చెర్ల, పొందూరు, ఆమదాలవలస మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేట, పొందూరు మండలం నందివాడ, బురిడీ, కంచరాం, లోలుగు, వీఆర్ గూడెం, రాపాక, దల్లవలస, తోలాపి, కింతలి, కనిమెట్ట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా ఆమదాలవలస మండలం వంజంగి, కనుగులవలస, కొత్తవలస, బొబ్బిలిపేట, కొర్లకోట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని, అక్కడ ఉన్న రాజకీయ పార్టీల ఏజెంట్లను పోలింగ్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ నిర్వహణలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లతో కూడా మాట్లాడి ఎన్నికల నిర్వహణ తీరును తెలుసుకున్నారు.

గంటాను మర్యాదపూర్వకంగా కలిసిన మేయర్ ముక్కా శ్రావణి

విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి: గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):
జీవీఎంసీ నూతన మేయర్‌గా ఎన్నికైన ముక్కా శ్రావణి గురువారం ఎంవీపీ కాలనీలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గంటా దంపతులు శ్రావణిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. విశాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా విశ్వనగరంగా అభివృద్ధి చేయాలని గంటా సూచించారు. ఐటీ, పర్యాటకం, రియల్ ఎస్టేట్ రంగాల్లో అభివృద్ధికి అనుగుణంగా అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ముక్కా శ్రావణి మాట్లాడుతూ, 2021లో గంటా శ్రీనివాసరావు తనకు కార్పొరేటర్ టికెట్ ఇచ్చారని, ఆయన ప్రోత్సాహంతో విజయం సాధించానని గుర్తుచేసుకున్నారు. తన గెలుపుకు గంటా సెంటిమెంట్‌గా భావించి, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న భీమిలి నుంచే మేయర్ అభ్యర్థిగా ప్రచారం ప్రారంభించానన్నారు. గతంలో తన తండ్రి ముక్కా ముత్యాల నాయుడుకు కార్పొరేటర్ టికెట్ ఇప్పించడంలోనూ గంటా సహకరించారని తెలిపారు. మేయర్‌గా ఎన్నికైన అనంతరం ఆయన ఆశీస్సులు తీసుకోవడానికి వచ్చానని పేర్కొన్నారు.

భారత్-శ్రీలంక తొలి వన్డేకు విశాఖ వేదిక..

బీసీసీఐ కీలక ప్రకటనతో క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం!
డిసెంబర్ 13న మధురవాడ ఏసీఏ -వీడీసీఏ స్టేడియంలో మ్యాచ్.. ఢిల్లీ నుంచి వైజాగ్‌కు మారిన వేదిక



విశాఖపట్నం, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):
విశాఖ క్రికెట్ అభిమానులకు బీసీసీఐ తీపి కబురు అందించింది. భారత్--శ్రీలంక జట్ల మధ్య జరగనున్న మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌కు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుంది. తొలుత ఢిల్లీలో నిర్వహించాల్సిన ఈ మ్యాచ్‌ను విశాఖకు మారుస్తూ భారత క్రికెట్ నియంత్రణ మండలి గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. దీంతో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం స్థానిక అభిమానులకు మరోసారి దక్కనుంది. డిసెంబర్ 13న జరగాల్సిన తొలి వన్డేకు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం తొలుత వేదికగా నిర్ణయించారు. అయితే స్టేడియంలో ప్రతిపాదిత పునరుద్ధరణ పనులు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా మ్యాచ్ నిర్వహణలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) బీసీసీఐకి విజ్ఞప్తి చేసింది. ఈ అభ్యర్థనను పరిశీలించిన బీసీసీఐ తొలి వన్డేను విశాఖపట్నంలోని ఏసీఏ--వీడీసీఏ క్రికెట్ స్టేడియానికి మార్చింది. మ్యాచ్ తేదీ, సమయాల్లో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు.

వన్డే, టీ20 మ్యాచ్‌ల షెడ్యూల్ ఇదే
భారత్--శ్రీలంక జట్ల మధ్య తొలి వన్డే డిసెంబర్ 13న మధ్యాహ్నం 2 గంటలకు విశాఖలో ప్రారంభం కానుంది. రెండో వన్డే డిసెంబర్ 16న బెంగళూరులో, మూడో వన్డే డిసెంబర్ 19న అహ్మదాబాద్‌లో జరగనున్నాయి. వన్డే సిరీస్ అనంతరం మూడు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. డిసెంబర్ 22న రాజ్‌కోట్‌లో తొలి టీ20, డిసెంబర్ 24న కటక్‌లో రెండో టీ20, డిసెంబర్ 27న పుణెలో మూడో టీ20 జరగనున్నాయి. తొలి వన్డే వేదిక విశాఖకు మారడంతో క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. డిసెంబర్ 13న మధురవాడ స్టేడియంలో జరగనున్న భారత్--శ్రీలంక పోరును వీక్షించేందుకు అభిమానులు ఎదురుచూస్తున్నారు.

కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్‌పై నిఘా..

పరిషత్ ఎన్నికల సరళిని పరిశీలించిన సాధారణ అబ్జర్వర్ ఎస్.ఎస్. శోభిక



విశాఖపట్నం, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):
జిల్లాలో పరిషత్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు చేపట్టిన చర్యలను ఎన్నికల సాధారణ పరిశీలకురాలు, జీసీసీ ఎండీ ఎస్.ఎస్. శోభిక పర్యవేక్షించారు. ఇందులో భాగంగా గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి, ఎన్నికల నిర్వహణ తీరును సమీక్షించారు. భీమిలి, పద్మనాభం, ఆనందపురం, పెందుర్తి మండలాల పరిధిలో జరిగిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సరళిని కంట్రోల్ రూమ్ ద్వారా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులు, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న తీరు, అధికారుల పనితీరును ఎప్పటికప్పుడు అందుతున్న సమాచార నివేదికల ఆధారంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో సందీప్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ యోగిత తదితర అధికారులు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియ, ఎప్పటికప్పుడు అందుతున్న నివేదికలు, ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను సాధారణ పరిశీలకురాలికి వివరించారు.

మాకవరపాలెంలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ తుహిన్ సిన్హా

పోలింగ్ ముగింపు వరకు అప్రమత్తంగా ఉండాలి.. భద్రతా విధుల్లో నిర్లక్ష్యం వద్దు

మాకవరపాలెం, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):
ఎన్నికల పోలింగ్ చివరి దశ వరకు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పటిష్ట భద్రత కల్పించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం మాకవరపాలెం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. మాకవరపాలెం, జి.గంగవరం, భీమబోయినపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడి పరిస్థితులను సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది అప్రమత్తత, ఓటర్ల రాకపోకలపై వివరాలు తెలుసుకున్నారు.

చివరి నిమిషం వరకు నిఘా కొనసాగించాలి
పోలింగ్ ముగిసే సమయం అత్యంత కీలకమని, ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని సురక్షితంగా కేంద్రాల నుంచి వెళ్లే వరకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. అనవసరంగా గుమిగూడే వ్యక్తులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బ్యాలెట్ బాక్సుల తరలింపునకు పటిష్ట భద్రత
పోలింగ్ పూర్తయిన అనంతరం ఎన్నికల సామగ్రిని రిసెప్షన్



కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే ప్రక్రియ అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని ఎస్పీ సూచించారు. ఎస్కార్ట్ బందోబస్తు మధ్య భద్రతాపరమైన నిబంధనలు పాటిస్తూ తరలింపు చేపట్టాలని తెలిపారు. సెక్టార్ అధికారులు, ప్రత్యేక పోలీసు బలగాలు, స్థానిక సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ పర్యటనలో సీఐలు బాల సూర్యారావు, నాగేశ్వరరావు, సింహాద్రి నాయుడు, ఎస్సై దామోదర్ నాయుడు, సెక్టార్ అధికారులు, బందోబస్తు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి పి. ప్రశాంతి

ఎన్నికల నిబంధనల అమలుపై ఆరా.. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశం

పి.గన్నవరం, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):
ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి పి. ప్రశాంతి గురువారం పి.గన్నవరం, అంబాజీపేట మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించారు. పి.గన్నవరం మండలంలోని జి.పెదపూడి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉడిమూడి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలతో పాటు అంబాజీపేట మండలంలోని పలు కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. పోలింగ్ ప్రక్రియ ఎలా కొనసాగుతోంది, ఓటర్ల హాజరు, ఎన్నికల సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు కల్పించిన మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించారు.

నిబంధనల అమలులో నిర్లక్ష్యం వద్దు
ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని అధికారులకు స్పష్టం చేశారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు.

ఓటర్లకు పూర్తి సౌకర్యాలు కల్పించాలి
ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, శాంతిభద్రతలు కొనసాగించేలా



సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పోలింగ్ ముగిసే వరకు నిరంతరం అప్రమత్తంగా ఉండి, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ బి. రమణ, అంబాజీపేట తహశీల్దార్ చిన్నబాబు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌లో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు డీబీఆర్‌సీ చేయూత..

బాధితులకు నిత్యావసరాలు, షెల్టర్ కిట్ల పంపిణీ
అమెజాన్, డొనేట్ కార్డ్ సంస్థల సహకారంతో మూడు ప్రాంతాల్లో సహాయక కార్యక్రమాలు



విశాఖపట్నం, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):
తుఫాన్ సృష్టించిన విధ్వంసంతో సర్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న నిరుపేద కుటుంబాలకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) సహాయాన్ని అందించింది. ప్రకృతి విపత్తుతో దెబ్బతిన్న కుటుంబాలకు తక్షణ అవసరాలు తీర్చేలా రేషన్, నివాసానికి ఉపయోగపడే షెల్టర్ కిట్లను పంపిణీ చేసింది. అమెజాన్, డొనేట్ కార్డ్ సంస్థల సహకారంతో విశాఖ నగరంలోని మూడు ప్రాంతాల్లో ఈ సహాయక కార్యక్రమాన్ని నిర్వహించారు. తుఫాన్ కారణంగా ఇళ్లు దెబ్బతిని, నివాస సౌకర్యం కోల్పోయిన బాధితులను గుర్తించి వారికి అవసరమైన సామగ్రిని అందజేశారు. ఒక్కో రేషన్ కిట్ విలువ రూ.1,500 కాగా, షెల్టర్ కిట్ విలువ రూ.3,000గా ఉంది. కంచరపాలెం గాంధీనగర్‌లో 48 కుటుంబాలకు రేషన్ కిట్లు, 28 కుటుంబాలకు షెల్టర్ కిట్లు అందించారు. రాజేంద్రనగర్‌లో 30 కుటుంబాలకు రేషన్ కిట్లు, 10 కుటుంబాలకు షెల్టర్ కిట్లు పంపిణీ చేశారు. ఏఎస్ఆర్ కాలనీలో 12 కుటుంబాలకు రేషన్ కిట్లు, ఆరు కుటుంబాలకు షెల్టర్ కిట్లను అందజేశారు. మూడు ప్రాంతాల్లో కలిపి మొత్తం 90 కుటుంబాలకు రేషన్ కిట్లు, 44 కుటుంబాలకు షెల్టర్ కిట్లు పంపిణీ చేశారు. విపత్కర పరిస్థితుల్లో బాధితులకు అవసరమైన సహాయం అందించడం ద్వారా వారి కుటుంబాలకు కొంత ఊరట కల్పించారు. ఈ కార్యక్రమంలో డీబీఆర్‌సీ సిటీ కోఆర్డినేటర్లు గురునాథ్, ధనలక్ష్మి, అజయ్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ నిఖిలతో పాటు కమ్యూనిటీ పెద్దలు పాల్గొన్నారు. తుఫాన్ బాధితులకు సహాయం అందించేందుకు ముందుకొచ్చిన అమెజాన్, డొనేట్ కార్డ్ సంస్థలకు డీబీఆర్‌సీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

రిజర్వేషన్ వివాదం.. రొంగలి వానిపాలెంలో ఓటింగ్‌కు గ్రామస్తుల సామూహిక బహిష్కరణ!

సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు కేటాయింపుపై తీవ్ర అభ్యంతరం.. ఉదయం నుంచి సాయంత్రం వరకు బోసిపోయిన పోలింగ్ కేంద్రం

అధికారుల బుజ్జగింపులు విఫలం.. పోలింగ్ సామగ్రితో వెనుదిరిగిన ఎన్నికల సిబ్బంది

అనకాపల్లి, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):

ఒక గ్రామం.. ఒక రిజర్వేషన్ వివాదం.. చివరకు ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియకే నిరసన సెగ తగిలింది. సర్పంచ్ పదవిని ఎస్సీ మహిళకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ అనకాపల్లి మండలం రొంగలి వానిపాలెం గ్రామస్తులు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను సామూహికంగా బహిష్కరించారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికల సిబ్బంది, పోలీసు బలగాలు పోలింగ్ కేంద్రం వద్ద వేచి చూసినా ఓటర్లు పెద్దగా స్పందించలేదు. గ్రామస్తుల నిరసనతో పోలింగ్ కేంద్రం బోసిపోయింది. అధికారుల పలుమార్లు జరిపిన చర్చలు కూడా ఫలించకపోవడంతో ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రితో వెనుదిరిగారు.

బీసీ మహిళ నుంచి ఎస్సీ మహిళకు రిజర్వేషన్ మార్పు!

రొంగలి వానిపాలెం గ్రామ సర్పంచ్ పదవిని తొలుత బీసీ మహిళకు రిజర్వ్ చేస్తూ అక్టోబర్ 15న గెజిట్ నోటిఫికేషన్ విడుదలైనట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం మరో గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అదే పదవిని ఎస్సీ మహిళకు కేటాయిస్తూ మార్పు చేశారని పేర్కొన్నారు. మండలంలోని మరో 12 గ్రామాల్లోనూ ఇదే తరహాలో రిజర్వేషన్ల మార్పులు జరిగాయని, అయితే తమ గ్రామానికి జరిగిన కేటాయింపుపై అభ్యంతరాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

821 మంది ఓటర్లు.. ఎస్సీ ఓటర్లు తొమ్మిది మందే!

గ్రామంలో మొత్తం 821 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం ఎస్సీ ఓటర్లు కేవలం తొమ్మిది మంది మాత్రమే ఉన్నారని గ్రామస్తులు చెబుతున్నారు. వారిలో కొందరు గ్రామంలో నివసించడం లేదని, ప్రస్తుతం స్థానికంగా ఆరుగురు మాత్రమే ఉన్నారని పేర్కొంటున్నారు. అయితే 2011 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్ కేటాయించామని



అధికారులు వివరిస్తున్నారని తెలిపారు. అప్పటి జనాభా లెక్కల్లో గ్రామంలో 120 మంది ఎస్సీ ఓటర్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారని గ్రామస్తులు ప్రస్తావించారు. ప్రస్తుత జనాభా పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా పాత గణాంకాల ఆధారంగా రిజర్వేషన్ ఎలా కేటాయిస్తారని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఒకసారి విడుదల చేసిన గెజిట్‌ను మార్చాల్సి వస్తే అన్ని గ్రామాల్లోనూ ఒకే విధమైన నిబంధనలు పాటించాల్సి ఉండగా, ఎంపిక చేసిన గ్రామాల్లో మాత్రమే మార్పులు చేయడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపిస్తున్నారు.

అధికారుల చర్చలు విఫలం.. ఓటింగ్‌కు దూరంగా గ్రామస్తులు

కుంచంగి ఎంపీటీసీ పరిధిలోని రొంగలి వానిపాలెం పదో నంబర్ పోలింగ్ కేంద్రంలో అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించారు. గ్రామస్తులు తమ నిరసనను కొనసాగిస్తూ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. గ్రామంలో ఇద్దరు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు మాత్రమే ఓటు వేసినట్లు సమాచారం. మిగిలిన గ్రామస్తులు పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి కిరణ్ కుమార్, అనకాపల్లి రూరల్ సీఐ అశోక్ కుమార్, ఎంపీడీవో ఆశాజ్యోతి, తహశీల్దార్ ఆనందరావు తదితర అధికారులు గ్రామాన్ని సందర్శించి పెద్దలతో పలుమార్లు చర్చలు జరిపారు. అయినప్పటికీ గ్రామస్తులు తమ నిర్ణయాన్ని మార్చుకోలేదు.

రాజకీయాలకు అతీతంగా నిరసన

గ్రామ పెద్దలు రొంగలి రాంబాబు, దేవుడి నాయుడు, బొద్దపు సత్తిబాబు, బొద్దు దేవుడి బాబు తదితరులు రాజకీయాలకు అతీతంగా నిరసనకు నాయకత్వం వహించారు. సర్పంచ్ పదవి రిజర్వేషన్ విషయంలో తమ అభ్యంతరాలను పరిష్కరించే వరకు ఎన్నికల్లో పాల్గొనబోమని స్పష్టం చేశారు.

వచ్చే ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి వస్తుంది.. అధికారుల సూచన

ప్రస్తుత రిజర్వేషన్ విధానం అమలుకాకపోతే వచ్చే ఐదేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లోనూ ఇదే తరహా పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉందని జిల్లా పంచాయతీ అధికారి గ్రామ పెద్దలకు వివరించినట్లు తెలిసింది. అయినప్పటికీ గ్రామస్తులు తమ నిరసనను విరమించుకోలేదు. దీంతో ఎటువంటి ఎన్నికల కార్యకలాపాలు ముందుకు సాగకుండానే సిబ్బంది పోలింగ్ సామగ్రితో వెనుదిరిగారు. ఒక గ్రామంలో సర్పంచ్ పదవి రిజర్వేషన్‌పై మొదలైన వివాదం చివరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల బహిష్కరణకు దారితీయడం అనకాపల్లి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. రిజర్వేషన్ల కేటాయింపుపై గ్రామస్తులు లేవనెత్తుతున్న అభ్యంతరాలకు అధికారులు ఎలాంటి పరిష్కారం చూపుతారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఎన్నికల విధుల్లో విషాదం.. పోలింగ్ అధికారి హరిత మృతి!

మృతిపట్ల సీఎం చంద్రబాబు తీవ్ర విచారం

బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా

అమరావతి, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):



ఎన్నికల విధులు నిర్వహిస్తూ అస్వస్థతకు గురై పోలింగ్ అధికారి హరిత (58) మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం కాడదారకుంట పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సమయంలో హరితకు శ్వాస సంబంధిత సమస్య తలెత్తింది. దీంతో పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య బృందం వెంటనే ఆమెను కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించింది. అక్కడ అత్యవసర వైద్య చికిత్స అందించినప్పటికీ గురువారం మధ్యాహ్నం 12.50 గంటలకు ఆమె తుదిశ్వాస విడిచారు. హరిత అనంతపురం జిల్లా డి.హీరాహాల్ మండలం పూలకుర్తి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా కాడదారకుంట పోలింగ్ కేంద్రంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. హరిత మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హరిత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు!

గుర్రంకొండలో ఎన్నికల సరళిని పరిశీలించిన అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు



గుర్రంకొండ, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):

గుర్రంకొండ మండల పరిధిలో జరుగుతున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని పలు సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆయన స్వయంగా సందర్శించి ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు కల్పించిన మౌలిక వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఎన్నికల సిబ్బంది, పోలీసు అధికారులతో మాట్లాడిన కలెక్టర్ పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఓటర్లు ఉత్సాహంగా తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో కలెక్టర్‌తో పాటు స్థానిక తహశీల్దార్ లక్ష్మీ ప్రసన్న, ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీహరి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రిపల్లెలో ఎన్నికల వేళ తీవ్ర ఉద్రిక్తత!

రాళ్లు, బీరు సీసాలు, కర్రలతో పరస్పర దాడులు..

పెట్రోల్ బాంబుల కలకలం

భారీగా మోహరించిన పోలీసు బలగాలు.. ఘటనపై విచారణ



పులివెందుల, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):

పులివెందుల తాలూకా ఎర్రిపల్లె గ్రామంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రాల వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లను టీడీపీ ఏజెంట్లు, కార్యకర్తలు అడ్డుకుంటున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు సమాచారం. ఈ ఘర్షణలో ఇరువర్గాలు పరస్పరం రాళ్లు, బీరు సీసాలు, కర్రలతో దాడులకు దిగినట్లు తెలుస్తోంది. పెట్రోల్ బాంబులు కూడా ప్రయోగించినట్లు సమాచారం రావడంతో గ్రామంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు భారీగా గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. పెట్రోల్ బాంబులు ఎవరు ప్రయోగించారనే అంశంపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం. మరోవైపు, ఎన్నికలు సజావుగా జరగకుండా, ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రాకుండా భయాందోళనలు సృష్టించేందుకు టీడీపీకి చెందిన వారే పెట్రోల్ బాంబులు ప్రయోగించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆరోపించారు. ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

పోలింగ్ కేంద్రం వద్ద సాక్షి విలేకరిపై దాడి!

గాయపడిన పుల్లారెడ్డిని పరామర్శించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

ఘటన వివరాలు తెలుసుకున్న ఎంపీ, వైఎస్సార్‌సీపీ నేతలు

పులివెందుల, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):

కడప జిల్లా లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద సాక్షి విలేకరి పుల్లారెడ్డిపై దాడి జరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో గాయపడిన పుల్లారెడ్డిని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పరామర్శించారు. పుల్లారెడ్డి వద్దకు చేరుకున్న ఎంపీ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కూడా ఆయనను పరామర్శించి సంఘటన వివరాలను తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికంగా చర్చ జరుగుతోంది.



విశాఖ జిల్లాలో 82.51 శాతం పోలింగ్ నమోదు.. ఆనందపురంలో అత్యధికం

1,62,407 మంది ఓటర్లకు గాను 1,34,000 మంది ఓటు వినియోగం.. మహిళా ఓటర్లదే పైచేయి

విశాఖపట్నం, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):

విశాఖపట్నం జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌కు ఓటర్లు విశేషంగా తరలివచ్చారు. జిల్లాలోని నాలుగు మండలాల్లో గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ ముగిసే సమయానికి మొత్తం 82.51 శాతం ఓటింగ్ నమోదైంది. అందుబాటులో ఉన్న పోలింగ్ గణాంకాల ప్రకారం మొత్తం 1,62,407 మంది ఓటర్లకు గాను 1,34,000 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో జిల్లాలో ఓటింగ్ శాతం 82.51గా నమోదైంది. జిల్లాలో ఆనందపురం మండలం అత్యధికంగా 84.76 శాతం పోలింగ్‌తో మొదటి స్థానంలో నిలిచింది. భీమునిపట్నం మండలంలో 80.97 శాతం, పద్మనాభం మండలంలో 81.89 శాతం, పెందుర్తి మండలంలో 81.40 శాతం పోలింగ్ నమోదైంది. నాలుగు మండలాల పోలింగ్ సరళిని పరిశీలిస్తే ఆనందపురం మండలంలో ఓటర్లు అత్యధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకోగా, భీమునిపట్నం మండలంలో అత్యల్ప పోలింగ్ నమోదైంది.

మండలాల వారీగా పోలింగ్ వివరాలు

ఆనందపురం మండలంలో మొత్తం 51,951 మంది ఓటర్లకు గాను 44,041 మంది ఓటు వేశారు. వీరిలో 21,426 మంది పురుషులు, 22,615 మంది మహిళలు ఉన్నారు. మొత్తం 84.76 శాతం పోలింగ్ నమోదైంది. భీమునిపట్నం మండలంలో 36,943 మంది ఓటర్లకు గాను 29,912 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 14,435 మంది పురుషులు, 15,477 మంది మహిళలు ఉన్నారు. ఇక్కడ 80.97 శాతం పోలింగ్ నమోదైంది. పద్మనాభం మండలంలో 42,388 మంది ఓటర్లకు గాను 34,711 మంది ఓటు వేశారు. వీరిలో 16,951 మంది పురుషులు, 17,760 మంది మహిళలు ఉన్నారు. మొత్తం 81.89 శాతం పోలింగ్ నమోదైంది. పెందుర్తి మండలంలో



31,125 మంది ఓటర్లకు గాను 25,336 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 12,112 మంది పురుషులు, 13,224 మంది మహిళలు ఉన్నారు. ఇక్కడ 81.40 శాతం పోలింగ్ నమోదైంది.

మహిళా ఓటర్లదే అధిక భాగస్వామ్యం

జిల్లావ్యాప్తంగా నమోదైన పోలింగ్ గణాంకాల్లో మహిళా ఓటర్లు పురుషుల కంటే ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. మొత్తం 79,630 మంది పురుష ఓటర్లకు గాను 64,924 మంది ఓటు వేయగా, 82,777 మంది మహిళా ఓటర్లకు గాను 69,076 మంది ఓటు వేశారు. పురుషుల ఓటింగ్ శాతం 81.53 కాగా, మహిళల ఓటింగ్ శాతం 83.45గా నమోదైంది. మొత్తంగా విశాఖ జిల్లాలోని ఆనందపురం, భీమునిపట్నం, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో కలిపి 1,34,000 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో మహిళా ఓటర్ల భాగస్వామ్యం అధికంగా ఉండటంతో పాటు నాలుగు మండలాల్లోనూ 80 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడం ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల చురుకైన భాగస్వామ్యాన్ని స్పష్టం చేస్తోంది.

సీఎం ఆదేశాలతో కూనవరం- గచ్చికాయలపోర డ్రైన్‌లో ముమ్మరంగా పూడికతీత పనులు

2.6 కిలోమీటర్ల మేర డ్రెడ్జింగ్ పూర్తి.. మరో 600 మీటర్ల మేర మొగ ద్వారా క్లియరెన్స్

కాట్రేనికోన, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):

ఆర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో ముంపు సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కాట్రేనికోన మండలంలోని కూనవరం--గచ్చికాయలపోర డ్రైన్‌లో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు అధికార యంత్రాంగం పనులను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో డ్రెడ్జింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఆర్నాబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా గచ్చికాయలపోరను సందర్శించిన ముఖ్యమంత్రికి స్థానిక బాధితులు డ్రైన్‌లో పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని వివరించారు. వర్షాలు, తుఫాన్ల సమయంలో ముంపు సమస్య తీవ్రం కాకుండా కూనవరం నుంచి గచ్చికాయలపోర వరకు డ్రైన్‌ను శుభ్రం చేయించాలని కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్‌కు పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు పనులు ప్రారంభించి ఇప్పటివరకు మొత్తం 10.236 కిలోమీటర్ల పొడవున్న డ్రైన్‌లో 2.6 కిలోమీటర్ల మేర డ్రెడ్జింగ్ పూర్తి చేశారు. మరో 600 మీటర్ల మేర మొగ ద్వారా డ్రైన్‌ను క్లియర్



చేశారు. డ్రైన్‌లో నీటి ప్రవాహం సజావుగా సాగేలా మిగిలిన ప్రాంతాల్లోనూ పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. తద్వారా పరిసర గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా ముంపు ముప్పును తగ్గించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. తుఫాన్లు, భారీ వర్షాల సమయంలో స్థానికులకు ఇబ్బందులు కలగకుండా డ్రైన్‌ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి.

గుర్రంకొండలో ప్రశాంతంగా ముగిసిన స్థానిక ఎన్నికలు!

67 శాతం పోలింగ్ నమోదు.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు

12 ఎంపీటీసీ స్థానాలకు గాను 8 స్థానాలు టీడీపీకి ఏకగ్రీవం

గుర్రంకొండ, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):

గుర్రంకొండ మండలంలో గురువారం నిర్వహించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో ఒక జెడ్పీటీసీ స్థానంతో పాటు నాలుగు ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది. మండలంలో మొత్తం 67 శాతం ఓటింగ్ నమోదైనట్లు సమాచారం. ఎన్నికల సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి తమ విధులను సమర్థవంతంగా నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా, ఎన్నికలకు ముందే మండలంలోని మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు గాను 8 స్థానాలు తెలుగుదేశం పార్టీకి ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన నాలుగు ఎంపీటీసీ స్థానాలతో పాటు ఒక జెడ్పీటీసీ స్థానానికి గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం ఈ నెల 7వ తేదీన వెలువడనున్న ఫలితాలతో తేలనుంది.



కోనసీమ జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్

తుది నివేదికల ప్రకారం 65 శాతానికి చేరే అవకాశం.. నవంబర్ 7న ఓట్ల లెక్కింపు

అమలాపురం, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించడంలో అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో సహకరించిన అధికారులు, సిబ్బంది, ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మొత్తం 19 జెడ్పీటీసీ స్థానాలకు 75 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. అదేవిధంగా 379 ఎంపీటీసీ స్థానాలకు గాను ఏడు స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 372 స్థానాలకు 885 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. జిల్లావ్యాప్తంగా 1,294 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. సాయంత్రానికి సుమారు 62 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. తుది నివేదికలు అందిన అనంతరం పోలింగ్ శాతం 64 నుంచి 65 శాతానికి చేరుకునే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రతికూల వాతావరణంలోనూ ప్రత్యేక ఏర్పాట్లు

తుఫాను, భారీ వర్షాల ప్రభావం ఉన్న ప్రాంతాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అవసరమైన ప్రాంతాల్లో ఆటోలు, ట్రాక్టర్లు, పడవలను ఏర్పాటు చేసి ఓటర్లకు రవాణా సౌకర్యం కల్పించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ పోలింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో చర్యలు తీసుకున్నారు.



పటిష్ట బందోబస్తు మధ్య బ్యాలెట్ బాక్సుల తరలింపు

పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సులను పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురంలో స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. నవంబర్ 7వ తేదీన నాలుగు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికల భద్రత కోసం 750 మంది పోలీసులతో పాటు అదనపు బలగాలను మోహరించినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. బ్యాలెట్ బాక్సుల తరలింపునకు 120 రూట్లలో పోలీసు ఎస్కార్ట్ వాహనాలు, ట్రైకింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ముగిసిందని పేర్కొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని 872 ఆవాసాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. తాగునీటి పథకాలు, ఆక్వా రైతుల విద్యుత్ కనెక్షన్ల పునరుద్ధరణకు కూడా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ మహేష్ కుమార్

ఎన్నికల నిర్వహణపై సమీక్ష.. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచన



అమలాపురం, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సరళిని స్వయంగా పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. గురువారం అమలాపురం మండలం ఎదురుపల్లి గ్రామంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ఎలా కొనసాగుతోంది, ఎన్నికల సిబ్బంది విధులు ఏ విధంగా నిర్వహిస్తున్నారు, ఓటర్లకు ఎలాంటి సౌకర్యాలు కల్పించారనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తయ్యేలా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు, ఒత్తిళ్లు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అమలాపురం తహశీల్దార్ దివాకర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు!

నల్లపురెడ్డిపల్లెలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల సందడి



పులివెందుల, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):

పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ఉత్సాహంగా కొనసాగింది. గురువారం ఉదయం నుంచే ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి బారులు తీరారు. ఓటర్లు తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపించారు. ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా స్వచ్ఛందంగా పోలింగ్‌లో పాల్గొంటూ ప్రజాస్వామ్య ప్రక్రియలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు. గ్రామంలో ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనడంతో పోలింగ్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది.

అయ్యప్ప ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదు: కాట శ్రీనివాస్ గౌడ్

అధికారులు తక్షణమే నిర్మాణ పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి



గడ్డపోతారం, నవంబర్ 05 (సిటిజన్ టైమ్స్):

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని గ్రామంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ పనులను అధికారులు నిలిపివేయడంపై కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గురువారం నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి స్థానికులు, ఆలయ నిర్వాహకులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఆయన, గ్రామ ప్రజలందరికీ ఉపయోగపడే ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. గతంలో గ్రామ పంచాయతీ ఆమోదించిన తీర్మానాలు, అనుమతి పత్రాలు ఉన్నప్పటికీ పనులు నిలిపివేయడం తగదని పేర్కొన్నారు. అధికారుల చర్యలతో భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని, తక్షణమే ఆలయ నిర్మాణ పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

నగిరిపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే నల్లారి దంపతులు

కలికిరి నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):

అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం కలికిరి మండలం నగిరిపల్లి గ్రామంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, ఆయన సతీమణి నల్లారి తనూజ రెడ్డి తమ ఓటు హక్కును వినియో గించుకున్నారు.ఈ సందర్భంగా గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన అనంతరం ఎమ్మెల్యే దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు.



ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ వైఎస్ అవినాష్ రెడ్డి ఆరోపణలు

వైసీపీ ఏజెంట్లను అడ్డుకున్నారు.. సీసీ ఫుటేజీలను పరిశీలించాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి

పులివెందుల, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):


స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికార పార్టీ అక్రమాలకు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆరోపించారు. గురువారం పులివెందుల వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామినేషన్ల దశ నుంచి పోలింగ్ వరకు వైసీపీ అభ్యర్థులు, కార్యకర్తలను వివిధ రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. లింగాల, పులివెందుల, వేముల మండలాల్లో వైసీపీ పోలింగ్ ఏజెంట్లను కేంద్రాల్లో కూర్చోనివ్వకుండా అడ్డుకున్నారని, మరోవైపు టీడీపీ కార్యకర్తలకు మాత్రం అవకాశం కల్పించారని ఆరోపించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ కార్యకర్తలపై లాఠీచార్జి చేయడం, రిగ్గింగ్



జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. లింగాల మండలం పార్నపల్లి, పుణ్యభూతుల గ్రామాల్లో ఏజెంట్ల నియామకానికి ఆటంకాలు కలిగించారని, వేముల మండలంలోనూ ఇదే పరిస్థితి ఎదురైందని తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించిన లింగాల, పులివెందుల, వేముల మండలాల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. ఎన్నికల నిర్వహణలో అక్రమాలు జరిగినట్లు తేలితే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వైఎస్ అవినాష్ రెడ్డి స్పష్టం చేశారు.

పెళ్లి పీటలెక్కే ముందు ఓటు వేసిన నూతన జంట..

ప్రజాస్వామ్యానికి ఆదర్శంగా అఖిల్ దంపతులు!




అంబాజీపేట, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):

ఒకవైపు పెళ్లి సందడి.. మరోవైపు ప్రజాస్వామ్య పండుగ! జీవితంలో కొత్త ప్రయాణం ప్రారంభించబోతున్న వేళ తమ పౌర బాధ్యతను విస్మరించకుండా ఓటు హక్కును వినియోగించుకుని నూతన వధూవరులు అందరికీ ఆదర్శంగా నిలిచారు. పెళ్లి వేడుకకు ముందు సంప్రదాయ వివాహ దుస్తుల్లోనే పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేసిన పాలంగి అఖిల్ దంపతుల తీరు పలువురిని ఆకట్టుకుంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండల కేంద్రంలోని 41వ పోలింగ్ బూత్‌లో గురువారం ఈ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. వివాహ వేడుకకు సిద్ధమవుతున్న సమయంలోనే పెళ్లికొడుకు, పెళ్లికూతురు కలిసి పోలింగ్ కేంద్రానికి చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వ్యక్తిగత జీవితంలో కీలకమైన ఘట్టానికి సిద్ధమవుతూనే ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ భాగస్వామ్యాన్ని చాటుకున్నారు. నూతన వధూవరుల చైతన్యాన్ని గుర్తించిన సీనియర్ నాయకులు నాగాబత్తుల సుబ్బారావు వారిని అభినందించారు. ఓటు విలువను గుర్తించి బాధ్యతగా వ్యవహరించిన అఖిల్ దంపతులు యువతకు స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. పెళ్లి వేడుకకు ముందే ఓటు వేసి తమ ప్రాధాన్యతను చాటుకున్న ఈ జంట పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అమలాపురంలో పారిశుధ్య పనులకు కొత్త ఊపు..

యుద్ధప్రాతిపదికన శుభ్రత చర్యలు చేపట్టాలని చైర్మన్ ఆదేశం

రేపటి నుంచే పట్టణవ్యాప్తంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు.. కమిషనర్ హామీ



అమలాపురం, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):

పట్టణంలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు మున్సిపల్ యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలని అమలాపురం మున్సిపల్ చైర్మన్ నల్లా శ్రీధర్ సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వీధులు, ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాల్లో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన నల్లా శ్రీధర్ గురువారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో డిక్లరేషన్ ఫారం అందుకున్న సందర్భంగా కమిషనర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో నెలకొన్న పారిశుధ్య పరిస్థితులపై చర్చించారు. పలు ప్రాంతాల్లో నిలిచిపోయిన శుభ్రత పనులను వెంటనే పునఃప్రారంభించి, పట్టణమంతా పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఎన్నికల విధుల కారణంగా పారిశుధ్య సిబ్బందిని ఇతర ప్రాంతాలకు కేటాయించాల్సి రావడంతో పనుల్లో కొంత జాప్యం జరిగిందని వివరించారు. శుక్రవారం నుంచి పట్టణవ్యాప్తంగా యుద్ధప్రాతిపదికన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పూర్తిస్థాయిలో శుభ్రత చర్యలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని చైర్మన్ నల్లా శ్రీధర్ సూచించారు.

ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటే ఆయుధం.. చిర్ల జగ్గిరెడ్డి



కోనసీమ, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):

స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిర్ల జగ్గిరెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం గోపాలపురం గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు మాత్రమే కాకుండా, పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని చాటే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో భాగస్వాములు కావాలని అన్నారు. ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా తమ మనస్సాక్షి ప్రకారం ఓటు వేయాలని అర్హులైన ఓటర్లకు పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగేందుకు ఓటర్ల భాగస్వామ్యం ఎంతో అవసరమని చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు.

కోనసీమ జిల్లాలో 66.27 శాతం పోలింగ్ నమోదు.. ఆలమూరులో అత్యధికం

19 మండలాల్లో 7,23,010 మంది ఓటర్ల ఓటింగ్.. కాట్రేనికోనలో అత్యల్ప పోలింగ్

అమలాపురం, నవంబర్ 5 (సిటిజన్ టైమ్స్):

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ తుది గణాంకాలు వెల్లడయ్యాయి. జిల్లావ్యాప్తంగా 66.27 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. మొత్తం 19 మండలాల్లో 1,294 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, 10,90,975 మంది ఓటర్లకు గాను 7,23,010 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలాల వారీగా పోలింగ్ శాతాలను పరిశీలిస్తే ఆలమూరు మండలం 72.29 శాతంతో జిల్లాలోనే అత్యధిక పోలింగ్ నమోదైన మండలంగా నిలిచింది. ఉప్పలగుప్తంలో 71.84 శాతం, ఆత్రేయపురంలో 71.35 శాతం పోలింగ్ నమోదైంది. మరోవైపు కాట్రేనికోనలో 58.72 శాతం, రాజోలులో 59.40 శాతం పోలింగ్ నమోదై అత్యల్ప స్థానాల్లో నిలిచాయి.

మండలాల వారీగా పోలింగ్ శాతం ఇలా..

ఐనవిల్లి 69.83 శాతం, అల్లవరం 65.31 శాతం, అమలాపురం 67.32 శాతం, అంబాజీపేట 67.24 శాతం, ఐ.పోలవరం 65.27 శాతం, కె.గంగవరం 66.24 శాతం, కొత్తపేట 68.20 శాతం, మలికిపురం 62.94 శాతం, మామిడికుదురు 65.53 శాతం, ముమ్మిడివరం 65.62 శాతం, పి.గన్నవరం 66.66 శాతం, రామచంద్రపురం 66.99 శాతం, రావులపాలెం 68.92 శాతం, సఖినేటిపల్లి 61.02 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా జిల్లాలో 66.27 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన తుది గణాంకాలను ప్రకటించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఆర్డీవో సత్యనారాయణ

ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకం..

బాధ్యతగా ఓటు వేసిన అధికారి



కొత్తపేట, నవంబర్ 5 (సిటిజన్ట టైమ్స్)

ఎన్నికల్లో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమని చాటుతూ కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి జి.వి.వి. సత్యనారాయణ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా కొత్తపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 14వ నంబర్ పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యతను ఆయన చాటిచెప్పారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని సందేశమిచ్చారు.

పెద్దాపురంలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

పెద్దాపురం, సిటిజన్ టైమ్స్ నవంబర్ 05:

పెద్దాపురం మహారాణి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. ఈ నెల 07న కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ టేబుల్స్, మీడియా పాయింట్ ఏర్పాట్లను పరిశీలించి, కట్టుదిట్టమైన భద్రత, విద్యుత్తు, తాగునీరు తదితర సౌకర్యాలు పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ, జిల్లా పరిషత్తు సీఈఓ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



రెబల్ లుక్ లో హుమా ఖురేషి.. కుర్రాళ్లు ఏమైపోవాలి?

ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు ఒకవైపు సినిమా షూటింగ్లో బిజీగా ఉంటూనే.. మరొకవైపు గ్లామర్ తో కట్టిపడేస్తున్న విషయం తెలిసిందే. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ రోజుకో ఫోటోషూట్ తో అభిమానులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు.ఇలా ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్న ఎంతో మంది సెలబ్రిటీలు ప్రముఖ మ్యాగజైన్ కవర్ పేజీలపై కూడా దర్శనం ఇస్తూ మరింత క్రేజ్ దక్కించుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రముఖ బాలీవుడ్ బ్యూటీగా మంచి పేరు సొంతం చేసుకున్న హుమా ఖురేషి తాజాగా తన అధికారిక ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. జీక్యూ ఇండియా హీరోస్ మ్యాగజైన్ కోసం ఇచ్చిన ఫోజులలో ఈమె రెబల్ లుక్ చూసి కుర్రాళ్ళు సైతం భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ ఫీబీ ఫిలో రూపొందించిన ఓవర్ సైజ్డ్ బ్లాక్ లెదర్ జాకెట్ ధరించిన ఈమె దీనికి కాంబినేషన్లో వార్డుబోర్డు ఎన్. వై.సీ.బ్రాండ్ కు చెందిన సింపుల్ అండ్ స్లీక్ లెగ్గింగ్ ధరించింది. ఈ అవుట్ ఫిట్ కి తగ్గట్టుగా అవుట్ హౌస్ జువెలరీ కలెక్షన్ నుండి వచ్చిన ఇండస్ట్రియల్ స్టైల్ మెటల్ లింక్ లాంగ్ నెక్లెస్ ధరించి తన మేకోవర్ను ఫుల్ ఫీల్ చేసుకుంది.ముఖ్యంగా జీ క్యు ఇండియా హీరోస్ ఫోటోలకు సంబంధించిన ఈ బోల్డ్ అండ్ స్టైలిష్ లుక్ సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారింది. మొత్తానికైతే హుమా లుక్ చూసిన నెటిజన్స్ ఈ రేంజ్ లో అందాలు ఆరబోస్తే కుర్రాళ్ళు ఏమైపోవాలి అంటూ సరదాగా కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా అమ్మడి అందం సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారింది.ప్రముఖ బాలీవుడ్ నటిగా పేరు దక్కించుకున్న ఈమె ఇండస్ట్రీలోకి రాకముందు మోడల్ గా తన కెరీర్ మొదలుపెట్టింది. 2012లో 'గ్యాంగ్స్ ఆఫ్ వాస్సేపూర్' అనే చిత్రం ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఈమె.. హిందీతో పాటు తమిళ్,మరాఠీ, కన్నడ సినిమాలలో కూడా నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇకపోతే చివరిగా కన్నడ సినీ నటుడు యశ్ హీరోగా మలయాళ డైరెక్టర్ గీతూ మోహన్దాస్ దర్శకత్వంలో వచ్చిన కన్నడ - ఇంగ్లీషు ద్విభాష చిత్రమైన టాక్సిక్ లో ఎలిజిబెత్ అనే విలన్ పాత్ర పోషించింది. ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా అనుకున్నంత స్థాయిలో ఆకట్టుకోలేదు.ఇందులో హుమా ఖురేషి తో పాటు నయనతార , కియారా అద్వానీ, రుక్మిణి వసంత్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. 1940 నాటి గోవా నేపథ్యంలో సాగే భారీ బడ్జెట్ గ్యాంగ్స్టర్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ఆడియన్స్ ను ఆకట్టుకోవడంలో విఫలమయ్యింది. దీనికి తోడు హిందీలో పూజ మేరీ జాన్ అనే చిత్రంలో కూడా నటించింది. ఏది ఏమైనా ఒకవైపు వరుస సినిమాలలో నటిస్తూ.. మరొకవైపు ఇలా గ్లామర్ అందాలు ఆరబోస్తూ అభిమానులకు మరింత చేరువ అవుతోంది.







ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో రిటైర్.. 23 ఏళ్ల ప్రస్థానానికి ముగింపు

ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో సంచలన నిర్ణయం తీసుకున్నాడు. పోర్చుగల్ జాతీయ జట్టు తరఫున తన అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించాడు. 23 ఏళ్ల పాటు సాగిన ప్రస్థానానికి వీడ్కోలు చెబుతూ సోషల్ మీడియాలో భావోద్వేగ వీడియోను పంచుకున్నాడు. పోర్చుగల్ తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా, అత్యధిక గోల్స్ చేసిన ఫుట్‌బాలర్‌గా రికార్డులు సృష్టించిన 41 ఏళ్ల రొనాల్డో.. ఇకపై జాతీయ జట్టు తరఫున మైదానంలో కనిపించడు. తనకు ఎంతో ప్రత్యేకమైన 7వ నంబర్ జెర్సీని తర్వాతి తరం ఆటగాడికి అందించనున్నట్లు వెల్లడించాడు.

"జాతీయ జట్టు తరఫున మైదానంలో నా ప్రయాణం నేటితో ముగుస్తోంది. నేను సాగించిన ప్రస్థానం పట్ల గర్వంగా ఉంది. పోర్చుగల్ కోసం నా శక్తినంతా ధారపోశాననే సంతృప్తితో వీడ్కోలు చెబుతున్నా" అని రొనాల్డో తన సందేశంలో పేర్కొన్నాడు. అభిమానులు, కుటుంబ సభ్యులు, తనతో కలిసి ఆడిన సహచరులకు కృతజ్ఞతలు తెలిపాడు. 7వ నంబర్ జెర్సీ ఇక మరొకరి సొంతమైనా.. దానిని ధరించిన గర్వం తనకు ఎప్పటికీ ఉంటుందని చెప్పాడు.



కోచ్‌తో వివాదం.. చివరి రోజుల్లో కలకలం

రొనాల్డో అంతర్జాతీయ కెరీర్ ముగింపు ప్రకటనకు ముందు పోర్చుగల్ జట్టులో పరిణామాలు చర్చనీయాంశమయ్యాయి. ప్రధాన కోచ్ జార్జ్ జీసస్‌తో అతడికి విభేదాలు తలెత్తాయి. సెప్టెంబర్ 27న నార్వేతో జరిగిన నేషన్స్ లీగ్ మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1తో గెలిచినా.. రొనాల్డోకు ఒక్క నిమిషం కూడా ఆడే అవకాశం దక్కలేదు. ఫిట్‌నెస్ నిర్వహణలో భాగంగా తనకు విశ్రాంతి ఇస్తారని తొలుత చెప్పారని, ఆ తర్వాత నార్వేతో మ్యాచ్‌లో సుమారు 30 నిమిషాలు ఆడిస్తానని కోచ్ హామీ ఇచ్చాడని రొనాల్డో వెల్లడించాడు. విరామ సమయంలో వార్మప్ చేసినా మైదానంలోకి దిగే అవకాశం రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశాడు.

మ్యాచ్ తర్వాత మీడియాకు పరిస్థితిని వివరిస్తానని కోచ్ తనతో అంగీకరించిన విషయానికి భిన్నంగా మాట్లాడాడని రొనాల్డో ఆరోపించాడు. అయితే జట్టును ఎంపిక చేసే బాధ్యత తనదేనని జీసస్ స్పష్టం చేశారు. ఈ వివాదం నేపథ్యంలో డెన్మార్క్‌తో మ్యాచ్‌కు ముందు కోపెన్‌హేగన్‌లోని జట్టు శిబిరం నుంచి రొనాల్డో వెళ్లిపోయాడు. దీనిపై పోర్చుగల్‌లో విమర్శలు వెల్లువెత్తాయి. అనంతరం తన నిర్ణయం తప్పేనని అంగీకరించిన రొనాల్డో.. సహచర ఆటగాళ్లు, అభిమానులకు క్షమాపణలు చెప్పాడు.ఈ ఘటనపై పోర్చుగల్ ఫుట్‌బాల్ సమాఖ్య అతడికి 30 రోజుల సస్పెన్షన్‌తో పాటు 255 యూరోల జరిమానా విధించింది. అయితే ఆ శిక్షను వెనక్కి తీసుకోవడంతో తర్వాతి మ్యాచ్‌లకు అతడు అందుబాటులో ఉండే అవకాశం లభించింది. 2026 ప్రపంచకప్ తర్వాత అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకాలని గతంలో భావించిన రొనాల్డో.. సమాఖ్య అధ్యక్షుడు పెడ్రో ప్రోయెంకా సూచనతో ఆ నిర్ణయాన్ని పునరాలోచించినట్లు కథనంలో పేర్కొన్నారు.

రొనాల్డో రికార్డుల ప్రస్థానం

2003 ఆగస్టులో కజకిస్థాన్‌తో మ్యాచ్ ద్వారా పోర్చుగల్ జట్టులోకి అడుగుపెట్టిన రొనాల్డో.. ఆ మరుసటి ఏడాదే యూరో 2004 ఫైనల్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో గ్రీస్ చేతిలో పోర్చుగల్ ఓడిపోయినా.. జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. 2006 ప్రపంచకప్, 2012 యూరో కప్‌లలో పోర్చుగల్ సెమీఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. 2016 యూరో కప్ ఫైనల్‌లో ఫ్రాన్స్‌తో తలపడిన సమయంలో గాయంతో తొలి అర్ధభాగంలోనే రొనాల్డో మైదానం వీడాడు. అయినప్పటికీ పక్కన నిలబడి సహచరులను ఉత్సాహపరిచాడు. అదనపు సమయంలో ఎడెర్ చేసిన గోల్‌తో పోర్చుగల్ తొలి యూరో కప్ టైటిల్‌ను అందుకుంది. 2019లో స్విట్జర్లాండ్‌పై సెమీఫైనల్‌లో హ్యాట్రిక్ సాధించి నేషన్స్ లీగ్ తొలి టైటిల్ గెలవడంలోనూ రొనాల్డో కీలక పాత్ర పోషించాడు. 2025లో స్పెయిన్‌తో ఫైనల్‌లోనూ గోల్ చేసి రెండోసారి నేషన్స్ లీగ్ విజేతగా నిలిచిన జట్టులో భాగమయ్యాడు.

పోర్చుగల్ తరఫున 234 మ్యాచ్‌లు ఆడి 146 గోల్స్ చేసిన రొనాల్డో.. పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో ఈ రెండు విభాగాల్లోనూ ప్రపంచ రికార్డులు నెలకొల్పాడు. 2026 ప్రపంచకప్‌లో ఆరు వేర్వేరు టోర్నీల్లో గోల్స్ చేసిన తొలి ఆటగాడిగా మరో ఘనత సాధించాడు. యూరో కప్ చరిత్రలో అత్యధికంగా 14 గోల్స్, 30 మ్యాచ్‌లు ఆడిన రికార్డులు కూడా అతడి పేరిటే ఉన్నాయి.

పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించిన భారత్.. షేక్‌హ్యాండ్ ఇచ్చి కూల్ చేసిన ఇండియన్ ప్లేయర్స్

బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని నేషనల్ స్టేడియం వేదికగా (గురువారం, నవంబర్ 5, 2026) జరిగిన శాఫ్ ఛాంపియన్ షిప్ 2026 గ్రూప్-బి ప్రారంభ పోరులో భారత ఫుట్‌బాల్ జట్టు 3--2 గోల్స్ తేడాతో పాకిస్తాన్‌పై అదరిపోయే విక్టరీ సాధించింది. దాయాదిపై గెలుపుతో గ్రూప్-బి పాయింట్ల పట్టికలో ఇండియా టాప్‌లోకి దూసుకెళ్లగా.. మ్యాచ్ ముగిసిన తర్వాత ఇరు జట్ల ఆటగాళ్లు కరచాలనం చేసుకోవడం హాట్ టాపిక్ గా మారింది.



ఫస్ట్ హాఫ్‌లో సుహైల్ భట్ ఊచకోత:

మ్యాచ్ ప్రారంభం నుంచే పాకిస్తాన్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా వరుస గోల్స్‌తో విరుచుకుపడింది. ముఖ్యంగా సుహైల్ అహ్మద్ భట్ మ్యాచ్ ప్రారంభమైన 14వ నిమిషంలో తొలి గోల్, 20వ నిమిషంలో రెండో గోల్ సాధించి భారత్‌కు 2--0 లీడ్ దక్కేలా చేశాడు. ఇక 32వ నిమిషంలో మంగ్లెన్‌థాంగ్ కిప్జెన్ మూడో గోల్ సాధించి పాక్ డిఫెన్స్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. దీంతో పాక్ కు లభించిన పెనాల్టీ చాన్స్ నాన్-కన్వర్ట్ కావడంతో (షాయక్ దోస్త్ మిస్ చేశాడు) టీమిండియా ఫస్ట్ హాఫ్ ని 3--0 లీడ్‌తో ముగించింది.

సెకండ్ హాఫ్‌లో పాక్ కమ్‌బ్యాక్ డ్రామా:

సెకండ్ హాఫ్‌లో పుంజుకున్న పాకిస్తాన్ మ్యాచ్ ముగిసే సమయంలో భారత్ పై తీవ్ర ఒత్తిడి పెట్టింది. అట్యాకింగ్ పెంచిన పాక్ తరఫున నజీబ్ ఉల్లా (91వ నిమిషం), ఆలమ్‌గిర్ ఖూజీ (94వ నిమిషం) ఇంజ్యూరీ టైమ్‌లో రెండు గోల్స్ కొట్టి మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చారు. అయితే, భారత డిఫెండర్లు చివరి క్షణాల్లో అద్భుతంగా కంట్రోల్ చేసి, 3--2తో విజయాన్ని ఖాయం చేసుకున్నారు. ఈ విజయంతో గ్రూప్-బిలో భారత్ అగ్రస్థానంలో నిలవగా.. తమ నెక్స్ట్ మ్యాచ్‌లో బుధవారం (నవంబర్ 11న) మాల్దీవులతో ఇండియా తలపడనుంది.

ఆర్సీబీ రిటెన్షన్ లిస్ట్ 2027: కోహ్లీ, పాటీదార్ సేఫ్.. ఛాంపియన్ టీమ్ నుంచి 6 స్టార్స్‌పై వేటు?

ఐపీఎల్ 2027 మిని వేలానికి ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ తమ జట్టు వ్యూహాలపై స్పష్టమైన ప్లాన్‌తో ముందుకు వెళ్తోంది. టైటిల్ విన్నింగ్ కోర్‌ను కాపాడుకుంటూనే, జట్టు బ్యాలెన్స్ కోసం కొందరు ఆటగాళ్లను రిలీజ్ చేసేందుకు యాజమాన్యం సిద్ధమైంది. విరాట్ కోహ్లీ, కెప్టెన్ రజత్ పటిదార్‌లతో పాటు ప్రధాన బౌలర్లను రిటైన్ చేసుకోనున్న ఆర్సీబీ.. రొమారియో షెఫెర్డ్, నువాన్ తుషార లాంటి కీలక ఆటగాళ్లకు గుడ్‌బై చెప్పే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.



ఆర్సీబీ రిటైన్ చేసుకునే ఆటగాళ్లు :

ఆర్సీబీ జట్టు నిలకడను దెబ్బతీయకుండా ఉండేందుకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ ప్రధాన ఆటగాళ్లను కొనసాగించనుంది.

బ్యాటింగ్ విభాగం: రికార్డుల వీరుడు విరాట్ కోహ్లీ, కెప్టెన్ రజత్ పాటిదార్, దేవదత్ పడిక్కల్, ఫిలిప్ సాల్ట్, టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, జోర్డాన్ కాక్స్.

ఆల్‌రౌండర్లు: కృనాల్ పాండ్యా, వెంకటేష్ అయ్యర్, జాకబ్ బెథెల్.

బౌలింగ్ విభాగం: జేమ్స్ హేజెల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్, రసిఖ్ దార్ సలామ్, సుయాష్ శర్మ, స్వప్నిల్ సింగ్, జాకబ్ డఫీ.

యంగ్ టాలెంట్: వికీ ఓస్త్వాల్, సాత్విక్ దేశ్‌వాల్, కనిష్క్ చౌహాన్, విహాన్ మల్హోత్రా.

బెంగళూరు వదిలేయబోతున్న ప్లేయర్లు

ఐపీఎల్ మిని వేలంలో కొత్త బౌలింగ్ అప్షన్ల కోసం పర్స్ బ్యాలెన్స్ పెంచుకోవడానికి ఆర్సీబీ కొందరిపై వేటు వేయబోతుంది.

రొమారియో షెఫెర్డ్, నువాన్ తుషార: విదేశీ కోటా సర్దుబాటులో భాగంగా వీరిద్దరినీ రిలీజ్ చేయనున్నారు.

యష్ దయాళ్: ఫిట్‌నెస్, లభ్యత ఆధారంగా యష్ దయాళ్‌ను వదిలేసే ఛాన్స్ ఉంది.

మంగేష్ యాదవ్: రూ. 5.20 కోట్లకు కొనుగోలు చేసినప్పటికీ, వేరొక వేరియేషన్ బౌలర్ కోసం ఇతడిని రిలీజ్ చేయవచ్చు.

ఇతర ఆటగాళ్లు: రిచర్డ్ గ్లీసన్, అభినందన్ సింగ్.

షెఫెర్డ్, దయాళ్, తుషారలను విడుదల చేయడం ద్వారా ఆర్సీబీ సుమారు రూ. 8.10 కోట్ల పర్స్ బ్యాలెన్స్‌ని మరింత పెంచుకోనుంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776